ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 29 జూన్ 2025

అదునులో.. పదును లేదు...

- ముఖం చాటేసిన వానదేవుడు
- ఊరిస్తున్న మబ్బులు
- జాడలేని నైరుతి రుతుపవనాలు


దుక్కులు చేసిన పొలం

ఏటా వేరుశనగ సాగు చేస్తున్నా పెట్టుబడులు కూడా చేతికి రాక.. అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న జిల్లా రైతుల ఇబ్బందులు చూసైనా.. ఈ ఏడాది వానదేవుడి మనసు కరగలేదేమో... ఈ ఖరీఫ్‌లోనూ ముఖం చాటేశాడు.. ఓవైపు వేరుశనగ విత్తనాలు విత్తుకోవడానికి అదును దాటిపోతున్నా.. వరుణుడు దయ చూపడం లేదు. ఆకాశంలో మబ్బులు మాత్రం రైతులను ఊరిస్తున్నాయి. గత నెల చివరి వారం నుంచే జిల్లాలోకి ప్రవేశించి రైతుల్లో ఆశలు రేపిన నైరుతి రుతుపవనాల జాడ జూన్ ముగుస్తున్నా కనిపించడం లేదు. దీంతో ఈసారీ జిల్లా వేరుశనగ రైతుకు ఖరీఫ్ నిరాశే మిగిల్చేటట్లుగా ఉంది.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలలో ఎన్నడూ లేనట్లు.. ఈ ఏడాది మే మూడవ, నాల్గవ వారాలలో జిల్లాలో బాగా వానలు పడ్డాయి. అదే సమయంలో మే చివరికే జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో ఈసారి వానలకు కొదవ ఉండదని ఎంతో ఆశ పడ్డారు. అయితే రుతుపవనాలు వచ్చినప్పటికీ జిల్లాలో ఒకటో.. రెండో మండలాలు మినహా మిగిలిన చోట వానలు పడలేదు. మేలో కురిసిన వానల ఫలితంగా జిల్లాలో వేరుశనగ రైతులు సంతోషంగా సాగుకు సమాయత్తమయ్యారు. సాధారణంగా జిల్లాలో ప్రధానంగా ఖరీఫ్‌లో ఎక్కువగా వేరుశనగ పంటనే సాగు చేస్తారు. గతంలో ఖరీఫ్‌లో లక్ష హెక్టార్లకు పైగా వేరుశనగ సాగయ్యేది. అయితే ప్రస్తుతం అది 30 వేల హెక్టార్లకు కొంచెం అటూ..ఇటుగా సాగవుతోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి జిల్లాలో 3 వేల హెక్టార్లలోపే వేరుశనగ సాగైనట్లు తెలుస్తోంది. సాధారణ సాగులో పదవ వంతు మాత్రమే సాగైనట్లు సమాచారం. ప్రస్తుతం వానలు పడితేనే.. సకాలంలో పడినట్లు..రైతులు సాగు చేసుకోవడానికి అనువుగా ఉన్నట్లు..అయితే జిల్లాలో పలువురు రైతులు పొలాలు దుక్కులు చేసుకుని.. ఇళ్లలో వేరుశనగ విత్తనాలు సిద్ధం చేసుకుని ఎదురు చూస్తున్నారు. కొన్ని మండలాల్లో కనీసం వానజాడే లేక పొలాలను బీళ్లుగా వదిలేసి.. వాన కోసం ఆకాశం వైపు ఆశతో ఎదురు చూస్తున్నారు.


ఇళ్లలో సిద్దంగా ఉన్న వేరుశనగ విత్తనాలు

విత్తనాలు ఎక్కడ వేయాలో?

వేరుశనగ పంట కోసం విత్తనకాయలను కొనుగోలు చేశాను. ప్రతి ఏటా రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసే వాడిని. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో దుక్కులు కూడా చేయలేదు. ఇక వర్షాలు కురిసేది ఎప్పుడో..? పంట సాగు చేసేది ఎప్పుడో? అర్థం కావడం లేదు. ఒక వేళ పంట సాగు చేసినా.. సకాలంలో వానలు కురవకపోతే నష్టపోతాం. వేరుశనగ సాగు చేస్తున్న మాలాంటి రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉంది.



- ఆనంద్ కుమార్, సరిమడుగు, గుర్రంకొండ

అదునులో లేదు వర్షం



60 శేర్లు వేరుశనగ పప్పు ఇంట్లో సిద్ధంగా ఉంది. అదును వచ్చింది. అయితే వర్షం జాడలేదు. రెండు ఎకరాలు సాగు చేద్దామని సర్వం సిద్ధం చేసుకున్నా.. వర్షం పడేటట్లు లేదు. పడుతుందో.. లేదో తెలియని వానను చూస్తే సాగు చేయడానికే భయంగా ఉంది. సాగు చేసినా పెట్టుబడులు కూడా రావడం లేదు. గత ఏడాది సాగు చేసి నష్టపోయా.. ఈ ఏడాదైనా కలిసి వస్తుందన్న నమ్మకం కనిపించడం లేదు. దేవుడిపై భారం వేసి పంట సాగుకు సిద్ధంగా ఉన్నా.

- రమేశ్, అడవికమ్మపల్లె

వర్షం కోసం ఎదురుచూపులు



నేను ప్రతి సంవత్సరం వేరుశనగ సాగు చేస్తున్నాను. ఈ ఏడాది మేలో వర్షాలు పడడంతో ఐదు ఎకరాలు దుక్కులు చేశాను. కానీ జూన్‌లో సక్రమంగా వర్షాలు పడలేదు. 10 ఎకరాలలో సాగు చేయడానికి 20 మూటలు వేరుశనగ కాయలు కొన్నాను. విత్తనాలు కూడా సిద్ధం చేసుకున్నాం. ఇంత వరకు సరైన వర్షం పడలేదు. వాన కోసం ఎదురుచూపు తప్పడం లేదు.

- శివప్పనాయుడు, ఎగువగొట్టివీడు, గాలివీడు


ప్రత్యేక అలంకరణలో నరసింహ స్వామి

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రెడ్డెమ్మతల్లి మండల పూజ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మతల్లి పునఃప్రతిష్ఠ మండలపూజ మహోత్సవాన్ని శనివారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మండల పూజ కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే ఆలయంలో గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనం, మండల కలశ ఆరాధన, నవగ్రహ ఆరాధన పూజలను చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలను చేసి పరిమళభరిత పుష్పాలతో అలంకరించి, సహస్ర నామావళి పూజలను చేశారు. అనంతరం గణపతిహోమం, మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఈవో మంజుల, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

రాయచోటిటౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసులకు అధిక లోడ్‌ను కలిగి ఉంటే వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు 50 శాతం రాయితీతో ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని జిల్లా పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు 29వ తేదీ ఆదివారం రోజు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు జిల్లాలోని విద్యుత్ సంస్థకు సంబంధించిన అన్ని కలెక్షన్స్ సెంటర్స్‌లో అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సారా రహిత సమాజం కోసం కృషి చేద్దాం

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి మధుసూదన్


మత్తు పదార్థాలపై అవగాహనలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి మధుసూదన్

రాయచోటిటౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తయారు చేసేందుకు కృషి చేద్దామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి మధుసూదన్ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆల్కహాల్ వల్ల కలిగే నష్టాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మద్యం, నాటుసారా ఇలాంటివి ఉపయోగించడం వల్ల మనిషి జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు లోనై జీవితాలను పాడు చేసుకోకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా మత్తు పదార్థాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల జోలికి వెళితే కుటుంబాలు నాశనం అవుతాయని, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించి జిల్లాను మత్తు రహిత జిల్లాగా మార్చేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మానవతా సంస్థ సహదేవరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ అధికారి జోగేంద్ర, ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, లెక్చరర్ కృష్ణారెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ హుస్సేన్‌బాషా, రాయచోటి అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద పంపిణీకి పటిష్ట చర్యలు

- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం


ఒంటిమిట్టలో అధికారులతో మాట్లాడుతున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద పంపిణీకి పటిష్ట చర్యలు తీసుకోవాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. శనివారం ఒంటిమిట్టలోని కోదండ రామాలయాన్ని, దేవుడి కడపలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరింతగా అన్న ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణవేదిక వద్ద భక్తులకు కనిపించేలా శంఖు చక్రాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను ఆకట్టుకునేలా 27 నక్షత్రాల చెట్లను నాటాలన్నారు. ఆలయ పరిధిలో ఉన్న ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతకుముందు ఆయన దేవుని కడప లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులను త్వరగా చేయాలన్నారు. కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, టీటీడీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు నగేష్‌బాబు, ప్రశాంతి, ఈఈలు నాగరాజు, సుమతి, ఆలయ అర్చకులు, రాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసలు


రీజియన్‌లో మొదట స్థానంలో నిలిపిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఎం మూరే వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రీజియన్‌లో మదనపల్లె-1 డిపోను మొదటి స్థానంలో నిలిపిన ఉత్తమ ఉద్యోగులను ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి ప్రశంసించారు. శనివారం డిపోలో సెక్యూరిటీ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందించారు. ఇప్పటి వరకు ఈపీకే 41.04. ఓఆర్ 74.91 శాతం, కేఎంపీఎల్ 5.47 సాధించి రీజియన్‌లో ప్రథమ స్థానంలో నిలిచామని డీఎం తెలిపారు. అలాగే మే నెలలో ఎస్.రవీ 110 లీటర్లు డీజిల్ పొదుపు చేసినందుకు ప్రశంసించారు. అనంతరం బహుమతి అందించారు. ఇదే ఒరవడితో అందరూ కలిసికట్టుగా కష్టపడి పనిచేసి డిపో అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్, రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు నాలుగు ఫిర్యాదులు

మదనపల్లె-2 డిపోలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు ఆ డిపో డీఎం అమరనాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె నుంచి తరిగొండ మీదుగా గుర్రంకొండకు ప్రస్తుతం నడుస్తున్న సమయంలోనే బస్సులు నడపాలన్నారని తెలిపారు. మదనపల్లె నుంచి రామసముద్రం మీదుగా ఎలవనెల్లూరుకు రెండేళ్ల క్రితం బస్సు నడిచేదని మళ్లీ ఇప్పుడు పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. రామసముద్రం మార్గంలో ఉదయం 9 గంటలకు సర్వీసులు పెట్టాలని ప్రయాణీకులు కోరారని, అయితే ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని ప్రయత్నిస్తాం అని డీఎం అమరనాథ్ తెలిపారు.

నాటుసారా రహిత గ్రామంగా వడ్డెపల్లె

- ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్


నాటుసారాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్

లక్కిరెడ్డిపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత గ్రామంగా కె.వడ్డెపల్లెను తీర్చిదిద్దామని లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తెలిపారు. శనివారం బి.యర్రగుడి, కోనంపేట గ్రామాల్లో సమావేశం నిర్వహించి నాటుసారాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు మద్య నిషేధ, అర్బన్ స్టేషన్ పరిధిలో కోనంపేట, వడ్డెపల్లెలను సి.విభాగం కింద సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దామన్నారు. గ్రామాల్లో కమిటీ ఏర్పాటు చేసి గ్రామ సర్పంచ్, రెవెన్యూ అధికారి, గ్రామ మహిళా పోలీస్, గ్రామ కమిటీ సభ్యులు, అటవీశాఖ బీట్ అధికారి, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో కమిటీలు ఏర్పాటు చేసి నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అందరి కృషి అవసరమని ఆయన అన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా 14405 నెంబర్‌కు ఫోన్ చేసి ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సింగిల్ విండోల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ 6

ఈ రోడ్డు ప్రయాణం.. నరకం 6

పని ఒత్తిడి తగ్గించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని శనివారం పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి విధిగా ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే గ్రామాల్లో పర్యటించి ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలనే విధులపై కొంత వెసులుబాటు కల్పించాలని వారు తెలిపారు. వాట్సాప్ కాల్‌లో నమోదు చేసి డీఎల్పీవో, డీపీవోకు, గౌరవ కమిషనర్‌కు పంపాలని ఆదేశాలు జారీ చేశారని ఇది కూడా చాలా కష్టమని వారు తెలిపారు. వాటితో పాటు కొన్ని అదనపు పనులు చేయాలని తెలిపారని, వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ఈ పనులు చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు, మహిళా పంచాయతీ కార్యదర్శులకు చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈ విషయాలపై కొంత వెసులుబాటు కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మూడు డివిజన్లలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు ప్రయాణం.. నరకం

● అర్ధాంతరంగా ఆగిన రాయచోటి- సుండుపల్లె డబుల్ రోడ్డు పనులు
● రెండేళ్లుగా ముందుకుపడని అడుగు ● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



సుండుపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రహదారి పనులు ఆలస్యం కావడంలో ప్రజలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. ఇది రాయచోటి- సుండుపల్లె రోడ్డు పనుల దుస్థితి. ఈ మార్గంలో రెండు వరుసల రోడ్డు అభివృద్ధికి మూడేళ్ల కిందట నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కావడం లేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రాయచోటి నుండి సుండుపల్లె, రాయవరం, పింఛా ప్రాంతాలకు నిత్యం రాకపోకలు జరుతుంటాయి. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ప్రజలు ప్రయాణం సాగించేందుకు సరైన రోడ్డు మార్గం లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాలకు రావాలన్నా, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా సమయం వృథా అవుతోంది. ఇదంతా అధికారులు, పాలకులకు తెలిసినా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అటవీ అనుమతుల సాకు

వైసీపీ పాలనలో డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే గుత్తేదారులకు సకాలంలో నిధులు అందించకపోవడం వలన పనుల్లో జాప్యం జరిగింది. పైగా రాయచోటి నుండి సుండుపల్లెకు వచ్చే మార్గమధ్యంలో అటవీ ప్రాంతం ఉండడం వలన అటవీశాఖ అనుమతుల పేరిట దాదాపు ఏడాదికి పైగా ప్రజలను మభ్యపెట్టారు. అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రధానంగా సుండుపల్లె రాచంవాండ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రం నుంచి అనుంపల్లి అటవీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా మట్టి కోతతో ప్రధాన రహదారి నుంచి ఎదురుగా వాహనం వచ్చే సమయంలో పక్కకు దిగి వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రెండు వరుసల రహదారి మంజూరైన కారణంగా నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో రహదారి అంచున భారీ కోతలు ఏర్పడ్డాయి. ఎట్టకేలకు అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూమి చూపడంతో అనుంపల్లి-రాయచోటి మార్గంలోని అటవీ ప్రాంతంలో రహదారి పనులు పూర్తయ్యాయి. కానీ అనుంపల్లి-సుండుపల్లె అటవీ ప్రాంతలో ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. కనీసం రహదారి పక్కన మట్టి చదును చేసినా సమస్య తీరుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. సుండుపల్లె-దిగువగుల్లావాండ్లపల్లె నుంచి సుండుపల్లె విద్యుత్ ఉపకేంద్రం వరకు కూడా సిమెంటు రహదారి పనులు జరగాల్సి ఉంది. రహదారంతా అధ్వానంగా ఉంది. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజల ప్రయాణాన్ని సౌకర్యవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛా వరకు వేస్తే:

ప్రస్తుతం రాయచోటి నుండి జీకేరాచపల్లె వరకు డబుల్ రోడ్డు పనులు అరకొరగా జరిగాయి. అయితే పింఛా వరకు డబుల్ రోడ్డు మంజూరు చేసి పుణ్యం కట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. సుమారు 80పల్లెల ప్రజలు నిత్యం ప్రయాణించే రోడ్డు కావడంతో డబుల్ రోడ్డు మంజూరు చేస్తే రవాణాకు వీలుగా ఉంటుందని చెబుతున్నారు. పైగా సుండుపల్లె, తిరుపతి జిల్లా నుండి రోజుకు మూడు సార్లు బస్సుల రాకపోకలు జరుగుతున్నాయి. రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది. కూటమి ప్రభుత్వంలోనైనా ముందడుగు పడాలని, డబుల్ రోడ్డు పూర్తి కావాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి..



డబుల్ రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం వలన రాయచోటికి పోవాలన్నా, రావాలన్నా ప్రయాణం నరకంగా మారింది. రహదారి ఇరువైపులా కోతకు గురి కావడం వలన ద్విచక్రవాహనం కిందికి దిగితే పడిపోవాల్సిన పరస్థితి ఉంది. వీలైనంత త్వరగా అటవీ ప్రాంతంలో డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయాలి.

- చెన్నంశెట్టి వెంకట్రమణ, సుండుపల్లె

త్వరలో పనులు ప్రారంభం..

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. చీఫ్ ఇంజనీర్ డబుల్ రోడ్డు పనులను తనిఖీ చేశారు. త్వరలో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాము.

- కుమార్‌బాబు, ఏఈ, ఆర్‌అండ్‌బీ



సుండుపల్లె-రాయచోటి మార్గంలో అసంపూర్తిగా వంతెన



శిథిలావస్థలో ఉన్న వంతెనపై ప్రయాణిస్తున్న వాహనం



వర్షానికి కోతకు గురైన రహదారి

రోళ్లబోడు బీట్‌లో కూంబింగ్



కూంబింగ్ చేస్తున్న అటవీశాఖ అధికారులు

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం రేంజ్ అటవీ సిబ్బంది శనివారం రోళ్లబోడు బీట్‌లోని పలు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి సిద్దవటం అటవీ క్షేత్ర కార్యాలయంలో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్రచందనం సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అటవీశాఖకు తెలియజేయాలని సమీప గ్రామాల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఎఫ్ఆర్వో కళావతి, గొల్లపల్లె సెక్షన్ డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ ఓబులేసు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్ఎస్‌వో కాశిరెడ్డి, ఎఫ్‌బీవోలు గాయత్రి, ఆది విశ్వనాథ్, మధు, పెంచలరెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మరణించిన వారం రోజులకే భర్త మృతి



పండ్రా మధు, అరుణ (ఫైల్)

రైల్వేకోడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం భార్య చనిపోయిన వారం రోజులకే భర్త మృతి చెందిన సంఘటన రైల్వేకోడూరు పట్టణంలోని బలిజవీధిలో చోటుచేసుకుంది. బలిజవీధిలో నివాసం ఉంటున్న పండ్రా అరుణ (58) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గత శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య చనిపోయిన రెండు రోజులకు భర్త పండ్రా మధు (65)కు తీవ్ర అస్వస్థతకు లోనవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు చెన్నై ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన మధు శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివాహానికి ముందు కువైత్ వెళ్లిన మధు నానా కష్టాలు పడి తిరిగి వచ్చేశాడు. తర్వాత తన సొంత అక్క కూతురును వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు కలిగారు. కొంత కాలం క్రితమే కూతురు వివాహం చేశాడు. రైల్వేకోడూరు పట్టణం లోని అంకమ్మనగర్‌లో కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ మధ్య కాలంలోనే అతని భార్య అనారోగ్యం బారిన పడింది. ఇటీవల అతనికి కూడా కాళ్ల వాపు రాగా, చికిత్స చేయించుకుంటున్నాడు. మొదట భార్య చనిపోవడం, తర్వాత వారానికి భర్త చనిపోవడంతో ఇటు కుటుంబ సభ్యులు, అటు బంధువులు కుమిలిపోయారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి):మదనపల్లె-కర్ణాటక సరిహద్దుల్లో శనివారం జరిగిన రోడు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మృతుడు ప్రకాశం జిల్లా, పెద్దచెర్లోపల్లె మండలం, మురుగుమీ గ్రామానికి చెందిన పి. ఎరికలయ్య కుమారుడు పెద్దిరెడ్డి పేరారెడ్డి (32)గా పోలీసులు గుర్తించారు. ఇతను బైక్‌పై బెంగళూరుకు వెళ్తుతుండగా మదనపల్లె - రాయల్పాడు మధ్యలో బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. స్థానికులు అతనిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పతికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే శవపరీక్షల కోసం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



శంకరయ్య మృతదేహం

ఒంటిమిట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందారు. సిద్దవటం మండలం మోదిన్‌సాహెబ్‌పల్లెకు చెందిన శంకరయ్య(50) శుక్రవారం రాత్రి ఒంటిమిట్టలో సరుకులు తీసుకుని ఇంటికి వెళుతుండగా శ్రీరామ కల్యాణవేదిక వద్ద ప్రమాదం జరిగింది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. . ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులపై రాళ్ల దాడి కేసులో ఇద్దరి అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రంపై దాడి చేసిన పోలీసులపై రాళ్లు విసిరి తప్పించుకున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. వివరాలిలా.. మదనపల్లె మండలం, కోటావారిపల్లెలో మార్చి 16న పేకాట కేంద్రంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేయగా, జూదరులు పోలీసులపై రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఈ దాడిపై తాలూకా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇప్పటిదాకా ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయకపోవడాన్ని శనివారం ఉదయం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సెట్ కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. ఈ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని తాలూకా సీఐని ఆదేశించారు. దీంతో కోటావారిపల్లె తాండాకు చెందిన మోహన్ నాయక్, శ్రీనా నాయక్‌ను ఆదివారం అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మున్నా నాయక్, ఆంజనేయులు నాయక్, రజనీ నాయక్, శివానాయక్, అజయ్ నాయక్, తరుణ్ నాయక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో మరి కొంతమంది ఉన్నట్లు వీడియోల్లో గుర్తించామని, వారిని కూడా అరెస్టు చేస్తామని సీఐ వివరించారు. ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

బి.కొత్తకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడం లేదంటూ ఓ వ్యక్తి బి.కొత్తకోట పోలీసులను ఆశ్రయించాడు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన బత్తుల వాసు(35)కు 14 ఏళ్ల క్రితం సునీల అనే మహిళతో వివాహం అయింది. సందీప్, కీర్తిక వీరి సంతానం. ఈనెల 27న ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన వాసు సాయంత్రం తిరిగి వచ్చేసరికి భార్య సునీలతో పాటు పిల్లలు కూడా కనిపించలేదు. దీంతో తన అన్న ఆంజనేయులుతో కలిసి చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్ బాబు శనివారం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతిచెందిన జింక

ములకలచెరువు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. బురకాయలకోట సమీపంలోని టోల్‌గేట్ వద్ద రోడ్డు దాటుతున్న జింకను శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షబీన్‌తాజ్ పరిశీలించి జింక కళేబరాన్ని ఖననం చేశారు.

రస్తాపై గృహ నిర్మాణం.. తహసీల్దారుకు ఫిర్యాదు



గ్రామస్థులు ఫిర్యాదు చేసిన నిర్మాణం

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెలో రస్తాకు కేటాయించిన మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మిన్నారని గ్రామస్థులు సిద్దవటం తహసీల్దారు తిరుమలబాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం సాయంత్రం ఆర్ఐ ప్రసాద్, పెద్దపల్లె ఇన్‌చార్జి వీఆర్వో కేశవులు పనులు నిలిపివేసి, సంబంధిత పత్రాలను తమ కార్యాలయానికి సమర్పించాలని నిర్మాణం చేపట్టిన వ్యక్తిని ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.

మార్కెట్ యార్డులో అన్న క్యాంటీన్!



సర్వేయర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి

పీలేరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. శనివారం సర్వేయర్‌తో కలిసి యార్డు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2014 -19 మధ్య పీలేరులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రబంధ, వినోద్‌కుమార్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ హరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు చెల్లించాలి



గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

నిమ్మనపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏజీ ఎం సంతోష్ హెచ్చరించారు. శనివారం అగ్రహారం పంచాయతీలో స్త్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించకపోవడంతో చింతపర్తి వారిపల్లి, నల్లగొండ, చెరువుముందరపల్లిలోని గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నవోదయ వీఓ కింద ఉన్న గ్రూపులు దాదాపు రూ.5.60 లక్షలు చెల్లించాలన్నారు. గతంలో ఇక్కడ సంఘమిత్రగా ఉన్న శారద సభ్యులు చెల్లించిన సొమ్మును దుర్వినియోగం చేయడంతో నవోదయ వీఓను బ్లాక్ లిస్టులో పెట్టామన్నారు. ప్రస్తుతం మండలానికి స్త్రీనిధి, ఉన్నతి నిధులు మంజూరయ్యాయని బకాయిలున్న గ్రూపు సభ్యులు సోమవారంలోగా చెల్లించాలని, లేని పక్షంలో చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ సాంబశివ, ఏపీఎం మురళి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో గొర్రెల బరువు వృద్ధి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న జేడీ గుణశేఖర్‌పిళ్లై

కలకడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నట్టల నివారణతో గొర్రెలు, మేకల బరువు వృద్ధి చెంది రైతులు ఆదా యం పొందవచ్చని పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. పోతువారిపల్లెలో నట్టల నివారణ శిబిరాన్ని తనిఖీ చేసి గొర్రెలకు మందు తాగించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ వరకు నట్టల నివారణ కార్యక్రమం ఉంటుందని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలానికి కేటాయించిన రూ.74 వేల డోసుల మందును సకాలంలో వేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఫలితాల నిర్ధారణ కోసం 10-14 రోజుల లోపు పేడ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ విండోల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్

● జిల్లాలో 13 సొసైటీల జాబితాలు విడుదలకు సిద్ధం
● ఏకాభిప్రాయం లేక 28 సింగిల్ విండోలు పెండింగ్
● మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేటల్లో అన్నీ పెండింగ్

కలికిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల్లో నామినేటెడ్ పదవుల భర్తీకి జాబితా సిద్ధమయ్యింది. జిల్లాలో 41 సింగిల్ విండోలుండగా, కేవలం 13 సొసైటీలకు మాత్రమే మోక్షం లభించింది. ఏకాభిప్రాయ సాధన లేకపోవడంతో ఇంకా 28 సొసైటీలు నియామక ప్రక్రియకు నోచుకోలేదు. పీలేరు నియోజకవర్గంలో అన్ని సొసైటీలకు పాలకవర్గాల జాబితా సిద్ధంగా ఉంది. రాయచోటి, కోడూరు నియోజకవర్గాల్లో పాక్షికంగా నియామకాలు జరగగా, మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో ఒక్కటంటే ఒక్క సొసైటీ కూడా నామినేటెడ్ పదవికి నోచుకోలేదు. ప్రస్తుతానికి 13 సొసైటీలకు సంబంధించిన జాబితాలను జిల్లా సహకార శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి శనివారం అందుకున్నారు. ప్రతి సింగిల్ విండోకు ఒక చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల వంతున ప్రతిపాదించిన జాబితాల్లోని పేర్లను మరొకసారి పరిశీలించి సంబంధిత ఎమ్మెల్యే ఆమోదం పొంది, వెంటనే రాష్ట్ర సహకార శాఖ కార్యాలయానికి పంపాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.. జాబితాల్లో కూడా స్టేటస్ అనే చోట యాక్టివ్, రెడీ టు రిలీజ్ అని చూపిస్తోంది. జిల్లాలో ఆరు సింగిల్ విండోలున్న పీలేరు నియోజకవర్గంలోని ఆరింటికీ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. రాయచోటిలో నాలుగు సొసైటీలకు, కోడూరులో మూడింటికి మాత్రం జాబితాలు సిద్ధమయ్యాయి. మార్కెట్ కమిటీల నియామకాల్లో కూడా వెనుకబడిన మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో ఒక్క సొసైటీ కూడా నామినేటెడ్ పదవులకు నోచుకోలేదు. టీడీపీ వర్గ విభేదాలతో సతమతమవుతున్న ఈ మూడు నియోజకవర్గాల్లో నామినేటెడ్ పోస్టుల నియామకాలకు తీవ్ర ఆలస్యం జరుగుతోంది.

నామినేటెడ్ పేర్ల వివరాలు

పీలేరు నియోజకవర్గంలోని పీలేరు సొసైటీకి చైర్మన్‌గా వై.రెడ్డెప్ప రెడ్డి, డైరెక్టర్లుగా ఎ.పుల్లయ్య, ఎస్.అమానుల్లాలు నియామకం కానున్నారు. కలికిరి సింగిల్ విండోకు చైర్మన్‌గా నల్లారి చంద్రకుమార్ రెడ్డి, డైరెక్టర్లుగా జె.సుబ్బయ్య, ఎస్.అల్లాబక్ష, గుర్రంకొండకు చైర్మన్‌గా ఎ.ఎల్.ఎన్. మూర్తి రావు, డైరెక్టర్లుగా ఎంఎస్ సలార్ సాహెబ్, ఎన్.సత్యనారాయణ రెడ్డి, కలకడకు ఎం.వెంకట్రమణ నాయుడు చైర్మన్‌గా, ఎం.వెంకట్రమణ, బి.గిరిజమ్మ డైరెక్టర్లుగా, కేవీ పల్లెకు ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి చైర్మన్‌గా కె.వెంకట్రమణ, డి.నారాయణ నాయుడు డైరెక్టర్లుగా, వాయల్పాడు సొసైటీకి కె.కృష్ణా రెడ్డి చైర్మన్‌గా, పి.మొహిద్దీన్ అలీఖాన్, ఎ.మధు డైరెక్టర్లుగా నియామకం కానున్నారు. కోడూరు నియోజకవర్గంలోని వీపీఆర్ కండ్రిగ సొసైటీకి చైర్మన్‌గా డి.కృష్ణంరాజు, డైరెక్టర్లుగా సి.వెంకట్రామయ్య, ఎం.నరసింహులు, ఆర్‌ఆర్ పురం సొసైటీకి టి.సుబ్రమణ్యం చైర్మన్‌గా బి.చంద్రయ్య, కె.మునీంద్ర డైరెక్టర్లుగా, చిట్వేలుకు మద్దిన సుమిత్ర చైర్‌పర్సన్‌గా, జి.నాగరాజ, ఎం.వెంకట్రమణ డైరెక్టర్లుగా నియామకాలు పొందారు. రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలంలోని సరస్వతిపల్లె సొసైటీకి జి.సురేంద్ర రెడ్డి చైర్మన్‌గా, పి.నాగేంద్ర, పి.నాగరాజ డైరెక్టర్లుగా లక్కిరెడ్డిపల్లె మండలంలోని మద్దిరబావుల సొసైటీకి బి.దేవేంద్ర రెడ్డి చైర్మన్‌గా జి.రెడ్డెయ్య, బి.బాబాఫక్రుద్దీన్ డైరెక్టర్లుగా, రామాపురం మండలంలోని కొలిమివాండ్లపల్లె సొసైటీకి ఎ.భాస్కర్ రెడ్డి చైర్మన్‌గా, ఎన్.సహదేవ రెడ్డి, సి.చంద్రశేఖర్, పి.ప్రభాకర్ రెడ్డి డైరెక్టర్లుగా, గాలివీడు మండలంలోని నూలివీడు ప్యాక్స్‌కు పి.ప్రభాకర్ రెడ్డి చెర్మన్‌గా, పి.మిట్టేనాయక్, బి.లోకేశ్వర డైరెక్టర్లుగా నియమితులు కానున్నారు.

హార్సిలీహిల్స్‌ను 'పతంజలి'కి అప్పగిస్తే ఉద్యమం

● కాంగ్రెస్, సీపీఐ నేతల హెచ్చరిక



హార్సిలీహిల్స్‌లో మాట్లాడుతున్న నాయకులు

బి.కొత్తకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వెల్‌నెస్‌సెంటర్ పేరుతో హార్సిలీహిల్స్‌ను పతంజలి సంస్థకు అప్పగిస్తే ఉద్యమిస్తామని కాంగ్రెస్, సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం పతంజలి అధి నేత, యోగా గురువు బాబా రాందేవ్ తన బృందంతో కలిసి హార్సిలీ హిల్స్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం మేరకు హార్సిలీహిల్స్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ లోని పలు పర్యాటక కేంద్రాలను పరిశీలిస్తున్నామని, ఈ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయిలో వెల్‌నెస్ సెంటర్‌ను నెలకొల్పుతామని ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన మదనపల్లె కాంగ్రెస్ ఇన్చార్జి రెడ్డిసాహెబ్, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు శనివారం హార్సిలీహిల్స్‌కు చేరుకొని పతంజలి సంస్థకు కేటాయించాలని భావిస్తున్న స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాందేవ్ బాబాపై తీవ్ర విమర్శలు చేశారు. హార్సిలీహిల్స్‌లో వున్న అటవీసంపదపై కన్నేసిన రాందేవ్‌బాబా వెల్‌నెస్ యోగాకేంద్రం స్థాపన పేరుతో రూ.కోట్ల విలువైన భూమిని కాజేయాలని చూస్తున్నారని, అదే జరిగితే పేదల ఊటీ హార్సిలీహిల్స్‌ను పేదలకు దూరం చేసినట్టేనని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయి వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు వల్ల పేదలకు ఏం ప్రయోజనం జరగదని, ఆర్థికంగా బలిసిన వ్యక్తులు అవాంఛనీయ కార్యకలాపాలు చేసేందుకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. హార్సిలీహిల్స్ రేవ్ పార్టీల కు, పాశ్చాత్య కల్చర్‌కు నిలయంగా మారుతుందని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల సహకారంతో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మనోహర్‌రెడ్డి, మురళి, తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి : డీసీహెచ్‌ఎస్



ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ ఆంజనేయులు

తంబళ్లపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ ఆంజనేయులు ఆదేశించారు. శనివారం తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులు, ఫార్మసీ, మందుల స్టాక్ రిజిస్టర్లు, పారిశుధ్యం పరిశీలించి ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, బాలింతల వార్డు, రక్త పరీక్షల ల్యాబ్, ఎక్స్‌రే విభాగాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్‌పేషెంట్లతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోజుకు ఎన్ని ఓపీలు చూస్తున్నారు..? ఎంతమందికి రక్త పరీక్ష లు చేస్తున్నారు.? ఏఏ పరీక్షలు చేస్తున్నారు.? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమై ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, అవసరమైన పరికరాలు, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్ ఎస్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో గుండెపోటు బాధితులకు అత్యవసర వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఖరీదైన గుండెపోటు నివారణ ఇంజక్షన్‌ను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారన్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆస్పత్రికి వచ్చే అత్యవసర కేసులపై దృష్టి సారించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి తేజస్విని, వైద్యులు విక్రాంత్‌రెడ్డి, మహేష్ రాజు, హెడ్ నర్సు గ్లోరి లిటిల్ ఫ్లవర్, సిబ్బంది బాలాజి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో దొంగ

● 8 తులాల బంగారు నగల రికవరీ

కడప క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన దొంగను కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఒకరోజు కస్టడీలోకి తీసుకుని విచారించారు. చిన్నచౌకు సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి దొంగను విచారించి 8 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు... నగరంలోని చిలకలబావి ప్రాంతానికి చెందిన షేక్ అక్బర్ ఆలీ ఎలక్ట్రీషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడని, వ్యసనాలకు బానిసై ఈజీమనీ కోసం దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. ఈనెల 7వ తేదీన దొంగను అరెస్టు చేసి నాలుగు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. పలు చోరీ కేసుల్లో అక్బర్ నుండి రికవరీ చేసేందుకు తదుపరి దర్యాప్తు కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జడ్జి దొంగను ఒకరోజు కస్టడీకి అనుమతించగా విచారించి 8 తులాల బంగారు నగలను రికవరీ చేశామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచడంతో రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు దొంగ నుండి 12 తులాల బంగారు నగలు రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్ సంపులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

జమ్మలమడుగు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు శేషారెడ్డి పల్లి వెళ్లే దారిలో రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(30) నీళ్ల సంపులో పడి మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి బుధవారం డెమో రైలులో వచ్చి రైల్వేస్టేషన్ వద్ద దిగి మూడు రోజుల నుంచి ఆ ప్రాంతంలో సంచరించినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మూడు రోజుల నుంచి ఆ ప్రాంతంలో తిరుగుతున్నట్లు అక్కడ పనిచేస్తున్న రైల్వేస్టేషన్ సిబ్బంది తెలుపగా ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే మృతుడు శుక్రవారం రాత్రి నీళ్ల సంపులో పడి ఉండొచ్చని, మృతుడి ఆచూకీ కోసం విచారిస్తున్నట్లు తెలిపారు. మృతుడు ఎర్రని చొక్కా, నల్లప్యాంటు ధరించాడని, లైటుగా గడ్డం ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతిపై అత్యాచారం

● పోలీసుల అదుపులో నిందితులు

దువ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిల్ చేసి ఓ యువతిపై అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దువ్వూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వేణు అనే యువకుడు మాయమాటలు చెప్పి యువతిని రహస్య ప్రదేశానికి పిలిపించుకుని అత్యాచారం చేశాడు. ఆ సమయంలో యువతిని నగ్నంగా ఫోటోలు తీసి శాడిజంతో ప్రవర్తించాడు. అంతటితో ఆగక వేణు తన స్నేహితుడు కార్తీక్‌కు ఆలస్యంగా ఈ విషయాన్ని తెలిపి సదరు వీడియోలు అతనికి కూడా చూపించాడు. కార్తీక్ ఇదే ధోరణిలో ప్రవర్తించి యువతి పట్ల బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి రహస్య ప్రదేశానికి పిలిపించుకుని అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే వీడియోలు బయటపెట్టడంతో పాటు చంపుతామని బెదిరించాడు. ఈ విషయాన్ని బాధిత యువతి ఆలస్యంగా పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు శనివారం వేణు, కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఖైదీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

● కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు

కడప క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు అన్నారు. కడప సెంట్రల్ జైల్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప కేంద్ర కారాగారంలో ప్రస్తుతం రిమాండ్ ఖైదీలు, శిక్ష పడిన ఖైదీలతో కలిపి 591 మంది ఉన్నారన్నారు. కడప కేంద్ర కారాగారంతో పాటు రాష్ట్రంలోని వివిధ కేంద్ర కారాగారాలకు సబ్బులను ఇక్కడి నుంచే తయారు చేసి పంపిస్తామన్నారు. ఇక్కడున్న స్టీలు ఫ్యాక్టరీలో దాదాపు 80మంది ఖైదీలు పని చేస్తున్నారని, అలాగే టైలరింగ్‌లో 40మంది, పెట్రోలు బంకులో 12మంది, క్లీనింగ్ బ్యాచ్ 60మంది మొత్తం 300మందికి పైగా వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్నారన్నారు. ఖైదీలకు రోజుకు స్కిల్ ఉన్న వారికి రూ.200, సెమీ స్కిల్ ఉన్న వారికి ఒక కేటగిరిలో రూ.180, సెమీ ఓపెన్ జైలు వారికి రూ.160 చెల్లిస్తామని, ఆ డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

11 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఏపీఈఏడీ, ఎంసీఏ రెండో సెమిస్టర్ విద్యార్థులకు జూలై 11నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు ఉంటా యన్నారు. పరీక్షల పూర్తిస్థాయి టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి పొందాలని ఆయన తెలిపారు.

శవాన్ని పూడ్చలేని దుస్థితిలో..
ఆలంఖాన్‌పల్లె శ్మశాన వాటిక

● తక్షణమే శ్మశానవాటికలో ఉన్న డ్రైనేజీ నీటిని తొలగించాలి

● లేనిపక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తాం

● శవంతో రాస్తారోకో చేసిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

కడప మారుతీనగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చనిపోయిన శవాన్ని పూడ్చలేని దుస్థితిలో ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటిక డ్రైనేజీ మురికినీరు, కంపచెట్లు.. జమ్ము, పిచ్చిమొక్కలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానంలో శవాన్ని పూడ్చేందుకు ఆరడుగుల జాగా కోసం వెతుకులాడుకునే పరిస్థితి దాపురించడం దారుణమన్నారు. గ్రామంలోని డ్రైనేజీ మురికినీటిని శ్మశానంలోకి మళ్లించడంతో మొత్తంగా మురికినీటి కుంటగా మారిందన్నారు. ఆ మురికినీటికి తోడు కంపచెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలు నిండుకుని శవాన్ని శ్మశానంలోకి తీసుకెళ్లలేక పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. పాలకులు మారుతున్నా ఆలంఖాన్‌పల్లె శ్మశానం దుస్థితి ఏమాత్రం మారకపోగా మరింత క్షీణదశకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె దళితవాడకు చెందిన పిడుగు రమేశ్ గుండెపోటుతో చనిపోయారు. ఈయన మృతదేహాన్ని పూడ్చడానికి వీలులేని దుస్థితిలో శ్మశాన వాటిక తయారైంది. ఈ నేపథ్యంలో సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో రమేశ్ మృతదేహంతో శ్మశానవాటిక వద్ద ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా శ్మశానవాటికలో సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. గతంలో వైసీపీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు మాత్రం ఓట్ల కోసం హామీలివ్వడం.. వాటిని గాలికొదిలేయడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. రెండు సంవత్సరాలుగా కలెక్టర్, నగరపాలక కమిషనర్, ఎమ్మెల్యేల దృష్టికి శ్మశానవాటిక సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. శ్మశానం రెండు వైపులా సాగు భూములు వెంచర్లుగా మారిన నేపథ్యంలో సమస్య మరింత జటిలమైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.


స్థలం లేకపోవడంతో బురదనీటిలోనే శవాన్ని పూడుస్తున్న దృశ్యం

కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు నరసింహారావు, చెంచయ్య, భాగ్యలక్ష్మి, భరత్, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు కేశవ్, ప్రసన్న, రాజేష్, చెంద్రాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


చనిపోయిన శవంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

పరిశుభ్రతే మనందరి బాధ్యత

● తెల్లవారుజామునే ఇంటింటా చెత్త సేకరణ జరిగి తీరాలి : డీపీవో రాజ్యలక్ష్మి


మైనార్టీ కాలనీలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రజలను, ఊరిని ఆరోగ్యంగా చేస్తుందని, అందుకోసం గ్రామ పంచాయతీ సిబ్బంది ఉదయం 6గంటలకే ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. చెన్నూరు పట్టణంలో శనివారం ఉదయం చెత్త సేకరణ కార్యక్రమాన్ని డీపీవో పరిశీలించారు. అలాగే చెన్నూరు నుండి హైలెవెల్ వంతెన మీదుగా కొండపేట వెళ్లే దారిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక వైపు పెన్నానదీ తీరం వెంబడి నిల్వ ఉన్న చెత్త దిబ్బలను పరిశీలించారు. అక్కడ సమీపంలో ఉన్న శివాలయానికి మంచి సిమెంటు రోడ్డు వేశారు కాబట్టి ఇక రాకపోకలకు ఇదే దారి ఉంటుందని, ఆలయానికి వెళ్లేవారు రోడ్డుకిరువైపులా ఉన్న చెత్త కుప్పలను, వ్యర్థాలను చూసి ముక్కుమూసుకుని వెళ్లకుండా భక్తితో వెళ్లాలంటే అందుకు తగ్గ వాతావరణం ఉండాలన్నారు. ఈ వాతావరణం పరిశుభ్రతతోనే సాధ్యమన్నారు. కావున అక్కడ చాలాకాలంగా నిల్వ ఉన్న చెత్త కుప్పలన్నీ పూర్తిస్థాయిలో తొలగించి అక్కడ మొక్కలు నాటి అందమైన బాటగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే తూర్పువీధి మైనార్టీ కాలనీలో డీపీవో పలు గృహాల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి తమ సిబ్బందికి అందించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌మోహనరావు, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ స్థలం ఆక్రమించారు

● తహసీల్దార్‌కు అంకాళమ్మ గూడూరు గ్రామస్థుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

సింహాద్రిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మ గూడూరులో వెలసిన అంకాళమ్మ దేవాలయ స్థలాన్ని ఆక్రమించారని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 392-ఎలో 2.77 ఎకరాల స్థలం పూర్వం నుండి అంకాళమ్మ దేవాలయానికి చెందినదని, తిరునాళ్ల సమయంలో చింత వనంలో అంగళ్ల ఏర్పాటుకు, అన్నదాన కార్యక్రమాలకు, వచ్చిన భక్తులు చెట్ల కింద సేదతీరడానికి, వాహనాల పార్కింగ్‌కు వినియోగించేవారన్నారు. గతంలో ఎద్దుల బండ్లపై భక్తులు వచ్చేవారని, ఈ ఎడ్లు చింతవనంలో చెట్ల కింద సేద తీరేవన్నారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు ప్రయత్నాలు సాగించగా గ్రామానికి చెందిన కొందరు ఆ స్థలం తమది అంటూ అభ్యంతరం తెలిపే ప్రయత్నం చేశారన్నారు. ఆలయ భూమి ఆక్రమణ కాకుండా చూడాలని అంకాళమ్మ గూడూరుతో పాటు కడపనాగయ్యపల్లి, బొజ్జాయపల్లి తదితర గ్రామాల ప్రజలు, భక్తులు తరలి వచ్చి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావుతో కలిసి తన చాంబర్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీకాం, బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలను 80 కళాశాలల నుంచి 55 కేంద్రాలలో నిర్వహించామన్నారు. రెండో సెమిస్టర్ అన్ని కోర్సులకు కలిపి 6679 మంది పరీక్షలకు హాజరుకాగా 3843 మంది ఉత్తీర్ణులయ్యారని, నాలుగో సెమిస్టర్‌లో బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల విద్యార్థులు 5902 మంది హాజరు కాగా 3857 మంది, డిగ్రీ అన్నిగ్రూపుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 4883 మంది హాజరు కాగా 4802 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ సుభోష్‌చంద్ర, డాక్టర్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాశినాయన, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఉప్పలూరు గ్రామానికి చెందిన దారిబోయిన రంగమ్మ(57) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపారు. వారి వివరాల మేరకు... బుధవారం వేపకాయలు ఏరుకుంటుండగా పాము కాటు వేసిందని, ఆ వెంటనే రామాయపల్లెలో నాటువైద్యం చేయించి అనంతరం చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం మృతురాలి భర్త వెంకట్రామయ్య కూడా చేపల వేటకు వెళ్లి సగిలేరులో పడి చనిపోయాడు.

దాడి చేసిన వ్యక్తి అరెస్టు



చెన్నూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు లక్ష్మీనగర్‌కు చెందిన అన్నవరం సుబ్బరాయుడును కత్తితో దాడి చేసిన సంఘటనలో శనివారం అరెస్టు చేసినట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. ఖాజీపేట మండలం చెముళ్లపల్లెకు చెందిన ములపాల సంతోష్‌కుమార్ గత నెల 28వ తేదీన వ్యక్తిగత పని మీద చెన్నూరు వచ్చారని, ఈ క్రమంలో పాత కక్షలను మనసులో పెట్టుకున్న అన్నవరం సుబ్బరాయుడు కత్తి తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. నెలరోజులుగా తప్పించుకుని తిరుగుతున్న సుబ్బరాయుడు ను స్థానిక కొత్తరోడ్డులో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎన్ఐఎస్‌డీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత


ప్రొఫెసర్ లలితకు ఆర్డర్‌ను అందజేస్తున్న వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ విభాగంలో జెరియాట్రిక్ కౌన్సెలింగ్‌పై అడ్వాన్స్ కోర్సు మాడ్యుల్‌ను సిద్ధం చేయడానికి ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీలో సభ్యురాలిగా యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కె.లలితకు చోటు లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్ఐఎస్‌డీ) సంస్థ వృద్ధుల కోసం మాడ్యుల్‌లను సిద్ధం చేయనుంది. అడ్వాన్స్ కోర్సు అయిన జెరియాట్రిక్ కౌన్సెలింగ్ కోసం సమగ్ర కోర్సు పాఠ్యాంశాలు, మాడ్యూళ్లను అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు గల స్టీరింగ్ కమిటీని నామినేట్ చేసింది. చైర్మన్‌గా ఎన్ఎస్‌ఐడీ డిప్యూటీ డైరెక్టర్ (సీనియర్ సిటిజన్ డివిజన్) డాక్టర్ హెచ్.సి.శ్రీధర్ చెన్నకేశవ రంగారెడ్డితో పాటు వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులతో కూడిన కమిటీలో వైవీయూ నుంచి డాక్టర్ లలిత పని చేయనున్నారు. ఇప్పటికే ఉన్న జాతీయ నైపుణ్య చట్రాలకు అనుగుణంగా కంటెంట్‌ను రూపొందించడం, తగిన అధ్యయన సామాగ్రి, అభ్యాస వనరులు అంచనా పద్ధతులను సిఫార్సు చేస్తారు. స్టీరింగ్ కమిటీ పదవీకాలం కోర్సుమాడ్యుల్స్ చివరిగా పూర్తిచేసి సమర్పించే వరకు ఉంటుందని ఎన్ఎస్‌ఐడీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హెచ్.సి.శ్రీధర్ చెన్నకేశవ రంగారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ప్రొఫెసర్ డాక్టర్ లలితకు ఎన్ఐఎస్‌డీ స్టీరింగ్ కమిటీలో చోటు దక్కడం ప్రశంసనీయమని వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కుల సచివులు ఆచార్య పి.పద్మ, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.లాజర్, సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి

సుండుపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు అమ్మనాయక్ తెలిపారు. శనివారం మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలో వెలిసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించామన్నారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి ప్రతి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తలనీలాలను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంబడి రాధాకృష్ణ

ఓబులవారిపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి డానియల్ మాదిగ, ఎంఎస్‌సీ జాతీయ నాయకులు వెలగచర్ల శివయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంబడి రాధాకృష్ణ మాదిగ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా ఇందుకూరు శివకుమార్, మండల ఉపాధ్యక్షుడు మినుకు చెంగల్‌రాయుడు, కార్యదర్శి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే మన సామాజిక వర్గానికి గుర్తింపు అవసరమని, అందుకు ప్రతిఒక్కరు కలిసికట్టుగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీసీవై పార్టీ ఇన్‌చార్జి మహేష్‌రెడ్డి, పాపు, గౌరవాధ్యక్షులు రాజేంద్ర, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు నగిరిపాటి చెంగయ్య, పోలి హరి, మండల నాయకులు మినుకు మల్లి, రాజేంద్ర తదితర నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవి ఉంటే ఇంట్లో పబ్జి.. పదవి లేకుంటే పరామర్శలు

● టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు

రైల్వేకోడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులకు పదవి ఉంటే ఇంట్లో పబ్జీలు ఆడుకుంటారని, పదవి లేని సమయంలో పరామర్శలు చేస్తుంటారని టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు ధ్వజమెత్తారు. శనివారం రైల్వేకోడూరులోని కస్తూరి విశ్వనాథనాయుడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి సైతం ఇంట్లో కూర్చుని పబ్జీలు ఆడుకునే వారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరామర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎక్కడా అవినీతి లేకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయినా ఆయనపై పనికట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు రవి, మహేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

బనకచర్ల గేమ్ చేంజర్ కాదు : వైసీపీ



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): బనకచర్ల గేమ్ చేంజర్ కాదని, చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే ప్రాజెక్టు అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని వైసీసీ కార్యాలయంలో ఆ యన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో లక్షల కోట్ల అప్పుల పేరుతో ము ఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాజధాని అభివృద్ధి అవసరమే కానీ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. రాయలసీమ ప్రజలను ఊరించడానికి బయనకచర్ల పేరు చెప్పి మభ్యపెడుతున్నారని విమర్శించారు. రూ.83 వేల కోట్లు కాదని, గండికోట రిజర్వాయర్ నుంచి కాలేటివాగు మీదుగా చేపట్టిన ప్రాజెక్టు ద్వారా ప్రతి ఇంటికి కుళాయి పథకాన్ని మేము ప్రారంభిస్తే ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం దాన్ని ముందుకు తీసుకెళ్లలేదన్నారు. రాయలసీమలోని యూనివర్సిటీలు, ప్ర భుత్వ కార్యాలయాలు తరలించుకుపోవడం సరైందికాదన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేశ్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు : ఎస్ఐ

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినవారిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్ రఫి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన శనివారం మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, ఇతరులకు ఇబ్బందికరంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రికెట్ మ్యాచ్‌లు



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న అనిల్

నందలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లె క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లోని మ్యాచ్‌లు శనివారం పోటాపోటీగా జరిగాయి

పాటూరు జట్టుపై చింతరాజుపల్లె విజయం

ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో పాటూరు జట్టుపై చింతరాజుపల్లె విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన చింతరాజుపల్లె జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 111 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పాటూరు జట్టు 12 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి పరాజయంపాలైంది. విజేత జట్టులో శ్రీను 3 వికెట్లు తీయడంతో పాటు 29 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సొంతం చేసుకున్నాడు.

కుమ్మరపల్లె జట్టుపై ఇసుకపల్లె జట్టు విజయం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో కుమ్మరపల్లె జట్టుపై ఇసుకల్లె జట్టు విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన ఇసుకపల్లె జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కుమ్మరపల్లె జట్టు 7 ఓవర్లలో 37 చేసి ఆలౌట్ అయ్యింది. ఇసుకపల్లె జట్టులో అనిల్ 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో అరవపల్లె క్రికెట్ లీగ్ సభ్యులు అరుణ్, బుల్లెట్ హరి, నవీన్, రాము, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంపై చిత్రలేఖనం పోటీలు

రాయచోటిటౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని శిబ్యాలకు సమీపంలో గల ఆదర్శ పాఠశాలలో శనివారం తల్లికి వందనంపై పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు ఈ పథకంపై వివిధ రకాల చిత్రాలను గీశారు. విద్యార్థులు గీసిన చిత్రలేఖనాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసిన బహుమతులను అందజేస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ నీలిరేఖ తెలిపారు. అలాగే శుక్రవారం విడుదలైన ఏపీ డీసెట్- 2025 పరీక్షా ఫలితాల్లో ఆదర్శ కళాశాల విద్యార్థిని షేక్ ఆసిఫా అంజుమ్ భౌతిక రసాయన శాస్త్ర విభాగంలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించినందుకు విద్యార్థినిని శాలువాతో సత్కరించారు.

ఉచిత వైద్యసేవలు నిర్వహించడం అభినందనీయం



వైద్యశిబిరంలో పాల్గొన్న టీడీపీ నేత మన్నేరు లక్ష్మీనరసయ్య

రాజంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఊటుకూరు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు మన్నేరు లక్ష్మీనరసయ్య అన్నారు. శనివారం రాజంపే ట మండలం ఊటుకూరులో రమాదేవి మల్టీస్పెషాలిటి హాస్పిటల్ వారి సహకారంతో లక్ష్మీనరసయ్య ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఊటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. తన తండ్రి, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, తాము ఊటుకూరు పంచాయతీ అభివృద్ధికి సర్పంచులుగా, ఎంపీటీసీలుగా ఎంతో కృషి చేశామన్నారు. నాయకులు కేఎస్ నరసింహులు, పి.సుధాకర్, రమణ, సర్పంచ్ ఈశ్వరయ్య, శివయ్య పాల్గొన్నారు.

సిద్దవటం వీఆర్వోకు అదనపు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన వీఆర్వో కేశవులు

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కేశవులు పెద్దపల్లె ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. శనివారం కేశవులు భాకరాపేట గ్రామ సచివాలయంలో మాట్లాడు తూ పెద్దపల్లె గ్రామ సచివాలయం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న శివశంకర్ అనారోగ్య కారాణాల వల్ల సెలవు పెట్టడం తో అదనపు బాధ్యతలు చేపట్టానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడు, ఉప సర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్కను నాటుతున్న గుర్రప్ప, తదితరులు

సంబేపల్లె, జూన్28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహాయ, సహకార సంఘాల (పీఏసీఎస్) కార్యాలయాల వద్ద స్వచ్ఛాంధ్ర స్వచ్ఛంద్రలో భాగంగా మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుకుందాం అని కడప డిప్యూటీ రిజిస్టర్, ప్రత్యేక విధుల అధికారి గుర్రప్ప తెలిపారు. శనివారం పీఏసీఎస్ అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురష్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సంబేపల్లె పీఏసీఎస్ సహకార సంఘం వద్ద మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ సహకార సంఘంలో వాయిదా బకాయిలపై సెక్షన్ 71, కోర్టు నిర్వహించిన 22 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. సంఘం సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని తెలియజేశారు. పీఏసీఎస్ సీఈవో సాబ్‌జాన్, సూపర్‌వైజర్ ప్రదీప్‌రెడ్డి, డీసీసీబీ కడప బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, మేనేజర్ ఆంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోదండరాముని సన్నిధిలో మాజీ ఎంపీ

ఒంటిమిట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయాన్ని హిందూపురం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణా రాఘవచార్యులు స్వాగతం పలికారు. మాజీ ఎంపీ కోదండరాముని దర్శించుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీని మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మామిళ్ల శ్రీహరి, మునగపాటి సుబ్బరాయుడు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడిగా సుబ్రహ్మణ్యం

రైల్వేకోడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు వ్యవసాయశాఖ ఉప సంచాలకుడిగా సుబ్రహ్మణ్యం (రెగ్యులర్) శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రాయచోటి భూసార సంరక్షణ కేంద్రంలో పనిచేస్తూ ఆయన రైల్వేకోడూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఉపసంచాలకులుగా ఉన్న కవితకు ఇంకా పోస్టింగ్ వేయలేదు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

విద్యార్థులు సవాళ్లను స్వీకరించాలి

రైల్వేకోడూరు రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సవాళ్లను స్వీకరించాలని వర్సిటీ డీన్ డాక్టర్ మాధవి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం కళాశాల 15వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్సిటీ డీన్ డాక్టర్ ఎం.మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులు డాక్టర్ రాజనాయక్, డాక్టర్ బయన్న, డాక్టర్ ముకుంద లక్ష్మి పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేద్దాం: సీఐటీయూ





రాయచోటి: మాట్లాడుతున్న ఓబులు.. ఓబులవారిపల్లె: సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్,జూన్28(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను రద్దు చేయాలనే డిమాండ్‌తో జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే సంపద సృష్టించడానికి పరిశ్రమలు, వ్యవసాయం ఆధారంగా ఆర్థిక సంపద పెంచాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కొత్త రంగాలను విస్తరించి కార్మిక వర్గ విస్తరణకు కృషి చేయాలన్నారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల పని గంటలు పెంచి జీతం పెంచక పోవడం దారుణమన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ జూలై 9న సమ్మెకు కరపత్ర ప్రచారం, బైక్ ర్యాలీ, గేట్ మీటింగులు పెట్టి అన్నమయ్య జిల్లా కార్మికులు ఐక్యపోరాటాల ద్వారా లేబర్ కోడ్స్ రద్దుకు కదిరి రావాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కౌలు రైతు సంఘం నాయకులు రమేశ్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, ఆఫీస్ లేబర్స్ రవికుమార్, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, వెంకట్రామయ్య, సురేంద్రబాబు, శ్రీలక్ష్మి, ఓబులమ్మ, మెహరున్నీషా, రైతు సంఘం బసిరెడ్డి, ఈశ్వరయ్య, ఎల్ఐసీ నాయకులు ఆదినారాయణరెడ్డి, సమగ్రశిక్ష నాయకులు మురళి, కార్మికులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎం.గంగాధర్, ఏపీఎంసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి, కలిశెట్టి నాగరాజు మాట్లాడుతూ జూలై 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను రద్దు పరిచి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్స్ అమలు పరచాలని ప్రయత్నిస్తోందన్నారు. ఏపీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గురుసాల దినేష్, వడ్డి లక్ష్మీనారాయణ, తుమ్మల కృష్ణచైతన్య, నారదాసు మణికంఠ, మద్దెల నాగార్జున, నరసింహాచారి, గుంట భానుప్రకాష్, గ్రందే మణికంఠ పాల్గొన్నారు.

'నా పొలానికి రహదారి చూపండి సారూ..'



మాట్లాడుతున్న రైతు నాగేశ్వరరావు

రాజంపేట టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో 224 సర్వేనంబరులో తన పూర్వీకుల నుంచి సంక్రమించిన పొలానికి రహదారి సౌకర్యం చూపాలని రైతు జగదబి నాగేశ్వరరావు అధికారులను కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి తన పొలానికి రహదారి లేకుండా ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఈ విషయమై గతంలో అనేకసార్లు ఘర్షణలు జరిగాయని, కోర్టు పరిధిలో ఈ సమ స్య ఉన్నప్పటికి తనపై దాడికి పాల్పడ్డారన్నారు.

గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి నిర్దేశించినప్పటికి తనను అడ్డుకుంటున్నారన్నారు. ఈ విషయంపై కోర్టులో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అధికారులు స్పందించి తన పొలానికి రహదారి చూపాలని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఓబులవారిపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి అన్నారు. శనివారం మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రంలో వానపాముల ఎరువుల యతారీని ఆయన పరిశీలించారు. గ్రామాల నుంచి తీసుకువచ్చిన చెత్తను తడి, పొడిచెత్తగా వేరు చేసి వాటిని ఎరువుగా మార్చి తిరిగి రైతులకు విక్రయించాలన్నారు. ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు



సాయిసందీప్, కార్యదర్శి

నందలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రెండు రైల్వే కార్మిక సంఘాలు రాజీ మార్గంలో ఏకమయ్యాయి. గుంతకల్ డివిజన్ పర్సనల్ డిపార్టుమెంట్ ఆఫీసర్ జూలై నెల 7న రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి.రెండు యూనియన్‌ల నాయకులు చర్చించుకుని ఎన్నికలు లేకుండా ఒక టర్మ్ (2 సంవత్సరాలు) ఒక యూనియన్, ఇంకో టర్మ్ మరొక యూనియన్ ఉండేటట్లు రాజీ కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ వారు మొదటి విడత రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గ కమిటీ సభ్యులుగా 2025 జూన్ నుంచి 2027 వరకు ఉంటారు. ఈ రెండు సంవత్సరాలకుగాను రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు కార్యదర్శి మజ్దూర్ యూనియన్ కార్మికుడు బొమ్మి సాయిసందీప్, జాయింట్ సెక్రటరీగా ఆకుల నాగరాజు, ట్రెజరర్‌గా మజ్దూర్ యూనియన్ కార్మికుడు షేక్ షావల్లి, కమిటీ మెంబర్స్‌గా యూనియన్ మెంబర్స్ బీవీ శివకుమార్‌రాజు, జి.సతీష్, సి.వెంకటేశ్వర్లు, ఇ.సుబ్రమణ్యం, బి.సిద్దయ్య, కె.సుబ్బరాయుడలను యూనియన్ నాయకులు ఎన్నుకున్నారు.

పంజం సుకుమార్‌రెడ్డికి పలువురి నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ పంజం సుకుమార్‌రెడ్డికి పలువురు నివాళులర్పించారు. శనివారం అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లెలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. జనసేన పార్టీ రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పంజం సుకుమారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

'ఉర్దూను అధికారిక భాషగా ప్రకటించిన ఘనత టీడీపీదే'

రాయచోటిటౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉర్దూ భాషను రెండవ అధికారిక భాషగా ప్రకటించిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని ఉర్దూ లైబ్రరీ తనిఖీ చేయడానికి వచ్చిన ప్రభుత్వ ఉర్దూ అకాడమీ డైరెక్టర్, హజ్ కమిటీ ఈవో గౌస్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి హిదాయతుల్లాలను కలిసి సన్మానించి ఉర్దూ లైబ్రరీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ ఖాదర్, టీడీపీ నాయకులు రౌఫా, రాజు, మస్తాన్, హైదర్, సలీం, అత్తర్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

వీరబల్లి, జూన్28(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనుల భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గడికోట గ్రామ పరిధిలోని వేల్పులమిట్టల హరిజన, గిరిజనవాడల్లో ఉన్న వీరికి సర్వే నెంబర్ 1128/7, 1128/9లో 2006 సంవత్సరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఒక్కొక్కరికి ఎకరా చొప్పున పంపిణీ చేశారు. అప్పటి నుండి ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కానీ ఈ మధ్యకాలంలో కొంత మంది ఆ భూములు మావి అని చదును చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, గంగయ్య, లక్ష్మీదేవి, వీరనాగమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న మంత్రి సతీమణి హరిత

రాయచోటిటౌన్, జూన్28(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని బేతల్‌కాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేసి పిల్లల చదువులో ఆసక్తి పెంచేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అంకితభావంతో ఉంటామన్నారు.

సూపర్ సిక్స్ అమలులో విఫలం: తులసిరెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి

రాజంపేట టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడి యేడాది దాటినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రధానంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాజంపేట ఆర్‌అండ్‌బి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా హామీలను అమలు పరిచాలని డిమాండ్ చేశారు. రాజంపేట నియోజకవర్గంలో అన్నమయ్య ప్రాజెక్టుతో పాటు ఏఒక్క హామీని అమలుపరచలేదని, వెంటనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధిపరచాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జి పూల భాస్కర్, కాంగ్రెస్ నాయకులు అత్తింజేరి శ్రీనాథ్, మహదేవయ్య, గురవయ్య, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

'మళ్లీ అధికారం మాదేనంటూ వైసీపీ కలలు'

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మళ్లీ అధికారం మాదేనంటూ వైసీపీ నేతలు కలలు కంటున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని మాధవరం-1 గ్రామం ఎస్‌కేఆర్ నగర్‌లోని టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కూటమి నేతలను జైల్లో పెడతామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసీపీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి, ఎస్ఆర్ఐ చంద్ర, టీడీపీ మహిళా నేత గంజి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు ప్రయాణం.. నరకం

- అర్ధాంతరంగా ఆగిన రాయచోటి - సుండుపల్లె డబుల్ రోడ్డు పనులు
- రెండేళ్లుగా ముందుకుపడని అడుగు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సుండుపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రహదారి పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. ఇది రాయచోటి- సుండుపల్లె రోడ్డు పనుల దుస్థితి. ఈ మార్గంలో రెండు వరుసల రోడ్డు అభివృద్ధికి మూడేళ్ల కిందట నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కావడం లేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రాయచోటి నుండి సుండుపల్లె, రాయవరం, పింఛా ప్రాంతాలకు నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ప్రజలు ప్రయాణం సాగించేందుకు సరైన రోడ్డు మార్గం లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాలకు రావాలన్నా, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా సమయం వృథా అవుతోంది. ఇదంతా అధికారులు, పాలకులకు తెలిసినా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో అటవీ అనుమతుల సాకు

వైసీపీ పాలనలో డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే గుత్తేదారులకు సకాలంలో నిధులు అందించకపోవడం వలన పనుల్లో జాప్యం జరిగింది. పైగా రాయచోటి నుండి సుండుపల్లెకు వచ్చే మార్గమధ్యంలో అటవీ ప్రాంతం ఉండడం వలన అటవీశాఖ అనుమతుల పేరిట దాదాపు ఏడాదికి పైగా ప్రజలను మభ్యపెట్టారు. అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రధానంగా సుండుపల్లె రాచంవాండ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రం నుంచి అనుంపల్లి అటవీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా మట్టి కోతతో ప్రధాన రహదారి నుంచి ఎదురుగా వాహనం వచ్చే సమయంలో పక్కకు దిగి వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రెండు వరుసల రహదారి మంజూరైన కారణంగా నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో రహదారి అంచున భారీ కోతలు ఏర్పడ్డాయి. ఎట్టకేలకు అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూమి చూపడంతో అనుంపల్లి-రాయచోటి మార్గంలోని అటవీ ప్రాంతంలో రహదారి పనులు పూర్తయ్యాయి. కానీ అనుంపల్లి-సుండుపల్లె అటవీ ప్రాంతలో ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. కనీసం రహదారి పక్కన మట్టి చదును చేసినా సమస్య తీరుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. సుండుపల్లె-దిగువగుల్లావాండ్లపల్లె నుంచి సుండుపల్లె విద్యుత్ ఉపకేంద్రం వరకు కూడా సిమెంటు రహదారి పనులు జరగాల్సి ఉంది. రహదారంతా అధ్వానంగా ఉంది. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజల ప్రయాణాన్ని సౌకర్యవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పింఛా వరకు వేస్తే:

ప్రస్తుతం రాయచోటి నుండి జీకేరాచపల్లె వరకు డబుల్ రోడ్డు పనులు అరకొరగా జరిగాయి. అయితే పింఛా వరకు డబుల్ రోడ్డు మంజూరు చేసి పుణ్యం కట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. సుమారు 80పల్లెల ప్రజలు నిత్యం ప్రయాణించే రోడ్డు కావడంతో డబుల్ రోడ్డు మంజూరు చేస్తే రవాణాకు వీలుగా ఉంటుందని చెబుతున్నారు. పైగా సుండుపల్లె, తిరుపతి జిల్లా నుండి రోజుకు మూడు సార్లు బస్సుల రాకపోకలు జరుగుతున్నాయి. రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది. కూటమి ప్రభుత్వంలోనైనా ముందడుగు పడాలని, డబుల్ రోడ్డు పూర్తి కావాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి..



డబుల్ రోడ్డు పనులు అర్థాంతరంగా ఆగిపోవడం వలన రాయచోటికి పోవాలన్నా, రావాలన్నా ప్రయాణం నరకంగా మారింది. రహదారి ఇరువైపులా కోతకు గురి కావడం వలన ద్విచక్రవాహనం కిందికి దిగితే పడిపోవాల్సిన పరస్థితి ఉంది. వీలైనంత త్వరగా అటవీ ప్రాంతంలో డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయాలి.

\- చెన్నంశెట్టి వెంకట్రమణ, సుండుపల్లె

త్వరలో పనులు ప్రారంభం..

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. చీఫ్ ఇంజనీర్ డబుల్ రోడ్డు పనులను తనిఖీ చేశారు. త్వరలో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాము.

\- కుమార్‌బాబు, ఏఈ, ఆర్అండ్‌బీ



సుండుపల్లె-రాయచోటి మార్గంలో అసంపూర్తిగా వంతెన



శిథిలావస్థలో ఉన్న వంతెనపై ప్రయాణిస్తున్న వాహనం



వర్షానికి కోతకు గురైన రహదారి

రోళ్లబోడు బీట్‌లో కూంబింగ్



కూంబింగ్ చేస్తున్న అటవీశాఖ అధికారులు

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం రేంజ్ అటవీ సిబ్బంది శనివారం రోళ్లబోడు బీట్‌లోని పలు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి సిద్దవటం అటవీ క్షేత్ర కార్యాలయంలో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్రచందనం సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అటవీశాఖకు తెలియజేయాలని సమీప గ్రామాల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఎఫ్ఆర్వో కళావతి, గొల్లపల్లె సెక్షన్ డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ ఓబులేసు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎఫ్ఎస్‌వో కాశిరెడ్డి, ఎఫ్‌బీవోలు గాయత్రి, ఆది విశ్వనాథ్, మధు, పెంచలరెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మరణించిన వారం రోజులకే భర్త మృతి




పండ్రా మధు, అరుణ (ఫైల్)

రైల్వేకోడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం భార్య చనిపోయిన వారం రోజులకే భర్త మృతి చెందిన సంఘటన రైల్వేకోడూరు పట్టణంలోని బలిజవీధిలో చోటుచేసుకుంది. బలిజవీధిలో నివాసం ఉంటున్న పండ్రా అరుణ (58) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గత శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య చనిపోయిన రెండు రోజులకు భర్త పండ్రా మధు (65)కు తీవ్ర అస్వస్థతకు లోనవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు చెన్నై ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన మధు శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివాహానికి ముందు కువైత్ వెళ్లిన మధు నానా కష్టాలు పడి తిరిగి వచ్చేశాడు. తర్వాత తన సొంత అక్క కూతురును వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు కలిగారు. కొంత కాలం క్రితమే కూతురు వివాహం చేశాడు. రైల్వేకోడూరు పట్టణం లోని అంకమ్మనగర్‌లో కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ మధ్య కాలంలోనే అతని భార్య అనారోగ్యం బారిన పడింది. ఇటీవల అతనికి కూడా కాళ్ల వాపు రాగా, చికిత్స చేయించుకుంటున్నాడు. మొదట భార్య చనిపోవడం, తర్వాత వారానికి భర్త చనిపోవడంతో ఇటు కుటుంబ సభ్యులు, అటు బంధువులు కుమిలిపోయారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి):మదనపల్లె-కర్ణాటక సరిహద్దుల్లో శనివారం జరిగిన రోడు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మృతుడు ప్రకాశం జిల్లా, పెద్దచెర్లోపల్లె మండలం, మురుగుమీ గ్రామానికి చెందిన పి. ఎరికలయ్య కుమారుడు పెద్దిరెడ్డి పేరారెడ్డి (32)గా పోలీసులు గుర్తించారు. ఇతను బైక్‌పై బెంగళూరుకు వెళ్తుతుండగా మదనపల్లె - రాయల్పాడు మధ్యలో బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. స్థానికులు అతనిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పతికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే శవపరీక్షల కోసం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



శంకరయ్య మృతదేహం

ఒంటిమిట్ట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందారు. సిద్దవటం మండలం మోదిన్‌సాహెబ్‌పల్లెకు చెందిన శంకరయ్య(50) శుక్రవారం రాత్రి ఒంటిమిట్టలో సరుకులు తీసుకుని ఇంటికి వెళుతుండగా శ్రీరామ కల్యాణవేదిక వద్ద ప్రమాదం జరిగింది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. . ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులపై రాళ్ల దాడి కేసులో ఇద్దరి అరెస్టు

మదనపల్లె అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రంపై దాడి చేసిన పోలీసులపై రాళ్లు విసిరి తప్పించుకున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. వివరాలిలా.. మదనపల్లె మండలం, కోటావారిపల్లెలో మార్చి 16న పేకాట కేంద్రంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేయగా, జూదరులు పోలీసులపై రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఈ దాడిపై తాలూకా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇప్పటిదాకా ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయకపోవడాన్ని శనివారం ఉదయం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సెట్ కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. ఈ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని తాలూకా సీఐని ఆదేశించారు. దీంతో కోటావారిపల్లె తాండాకు చెందిన మోహన్ నాయక్, శ్రీనా నాయక్‌ను ఆదివారం అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మున్నా నాయక్, ఆంజనేయులు నాయక్, రజనీ నాయక్, శివానాయక్, అజయ్ నాయక్, తరుణ్ నాయక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో మరి కొంతమంది ఉన్నట్లు వీడియోల్లో గుర్తించామని, వారిని కూడా అరెస్టు చేస్తామని సీఐ వివరించారు. ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

బి.కొత్తకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడం లేదంటూ ఓ వ్యక్తి బి.కొత్తకోట పోలీసులను ఆశ్రయించాడు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన బత్తుల వాసు(35)కు 14 ఏళ్ల క్రితం సునీల అనే మహిళతో వివాహం అయింది. సందీప్, కీర్తిక వీరి సంతానం. ఈనెల 27న ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన వాసు సాయంత్రం తిరిగి వచ్చేసరికి భార్య సునీలతో పాటు పిల్లలు కూడా కనిపించలేదు. దీంతో తన అన్న ఆంజనేయులుతో కలిసి చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్ బాబు శనివారం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతిచెందిన జింక

ములకలచెరువు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. బురకాయలకోట సమీపంలోని టోల్‌గేట్ వద్ద రోడ్డు దాటుతున్న జింకను శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షబీన్‌తాజ్ పరిశీలించి జింక కళేబరాన్ని ఖననం చేశారు.

రస్తాపై గృహ నిర్మాణం.. తహసీల్దారుకు ఫిర్యాదు



గ్రామస్థులు ఫిర్యాదు చేసిన నిర్మాణం

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెలో రస్తాకు కేటాయించిన మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారని గ్రామస్థులు సిద్దవటం తహసీల్దారు తిరుమలబాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం సాయంత్రం ఆర్ఐ ప్రసాద్, పెద్దపల్లె ఇన్‌చార్జి వీఆర్వో కేశవులు పనులు నిలిపివేసి, సంబంధిత పత్రాలను తమ కార్యాలయానికి సమర్పించాలని నిర్మాణం చేపట్టిన వ్యక్తిని ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.

సింగిల్ విండోల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్

- జిల్లాలో 13 సొసైటీల జాబితాలు విడుదలకు సిద్ధం
- ఏకాభిప్రాయం లేక 28 సింగిల్ విండోలు పెండింగ్
- మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేటల్లో అన్నీ పెండింగ్

కలికిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల్లో నామినేటెడ్ పదవుల భర్తీకి జాబితా సిద్ధమయ్యింది. జిల్లాలో 41 సింగిల్ విండోలుండగా, కేవలం 13 సొసైటీలకు మాత్రమే మోక్షం లభించింది. ఏకాభిప్రాయ సాధన లేకపోవడంతో ఇంకా 28 సొసైటీలు నియామక ప్రక్రియకు నోచుకోలేదు. పీలేరు నియోజకవర్గంలో అన్ని సొసైటీలకు పాలకవర్గాల జాబితా సిద్ధంగా ఉంది. రాయచోటి, కోడూరు నియోజకవర్గాల్లో పాక్షికంగా నియామకాలు జరగగా, మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో ఒక్కటంటే ఒక్క సొసైటీ కూడా నామినేటెడ్ పదవికి నోచుకోలేదు. ప్రస్తుతానికి 13 సొసైటీలకు సంబంధించిన జాబితాలను జిల్లా సహకార శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి శనివారం అందుకున్నారు. ప్రతి సింగిల్ విండోకు ఒక చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల వంతున ప్రతిపాదించిన జాబితాల్లోని పేర్లను మరొకసారి పరిశీలించి సంబంధిత ఎమ్మెల్యే ఆమోదం పొంది, వెంటనే రాష్ట్ర సహకార శాఖ కార్యాలయానికి పంపాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.. జాబితాల్లో కూడా స్టేటస్ అనే చోట యాక్టివ్, రెడీ టు రిలీజ్ అని చూపిస్తోంది. జిల్లాలో ఆరు సింగిల్ విండోలున్న పీలేరు నియోజకవర్గంలోని ఆరింటికీ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. రాయచోటిలో నాలుగు సొసైటీలకు, కోడూరులో మూడింటికి మాత్రం జాబితాలు సిద్ధమయ్యాయి. మార్కెట్ కమిటీల నియామకాల్లో కూడా వెనుకబడిన మదనపల్లె, తంబళ్ళపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో ఒక్క సొసైటీ కూడా నామినేటెడ్ పదవులకు నోచుకోలేదు. టీడీపీ వర్గ విభేదాలతో సతమతమవుతున్న ఈ మూడు నియోజకవర్గాల్లో నామినేటెడ్ పోస్టుల నియామకాలకు తీవ్ర ఆలస్యం జరుగుతోంది.

నామినేటెడ్ పేర్ల వివరాలు

పీలేరు నియోజకవర్గంలోని పీలేరు సొసైటీకి చైర్మన్‌గా వై.రెడ్డెప్ప రెడ్డి, డైరెక్టర్లుగా ఎ.పుల్లయ్య, ఎస్.అమానుల్లాలు నియామకం కానున్నారు. కలికిరి సింగిల్ విండోకు చైర్మన్‌గా నల్లారి చంద్రకుమార్ రెడ్డి, డైరెక్టర్లుగా జె.సుబ్బయ్య, ఎస్.అల్లాబక్ష్, గుర్రంకొండకు చైర్మన్‌గా ఎ.ఎల్.ఎన్. మూర్తిరావు, డైరెక్టర్లుగా ఎంఎస్ సలార్ సాహెబ్, ఎన్.సత్యానారాయణ రెడ్డి, కలకడకు ఎం.వెంకట్రమణ నాయుడు చైర్మన్‌గా, ఎం.వెంకట్రమణ, బి.గిరిజమ్మ డైరెక్టర్లుగా, కేవీ పల్లెకు ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి చైర్మన్‌గా కె.వెంకట్రమణ, డి.నారాయణ నాయుడు డైరెక్టర్లుగా, వాయల్పాడు సొసైటీకి కె.కృష్ణా రెడ్డి చైర్మన్‌గా, పి.మొహిద్దీన్ ఆలీఖాన్, ఎ.మధు డైరెక్టర్లుగా నియామకం కానున్నారు. కోడూరు నియోజకవర్గంలోని వీపీఆర్ కండ్రిగ సొసైటీకి చైర్మన్‌గా డి.కృష్ణంరాజు, డైరెక్టర్లుగా సి.వెంకట్రామయ్య, ఎం.నరసింహులు, ఆర్ఆర్ పురం సొసైటీకి టి.సుబ్రమణ్యం చైర్మన్‌గా బి .చంద్రయ్య, కె.మునీంద్ర డైరెక్టర్లుగా, చిట్వేలుకు మద్దిన సుమిత్ర చైర్‌పర్సన్‌గా, జి.నాగరాజ, ఎం.వెంకట్రమణ డైరెక్టర్లుగా నియామకాలు పొందారు. రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలంలోని సరస్వతిపల్లె సొసైటీకి జి.సురేంద్ర రెడ్డి చైర్మన్‌గా, పి.నాగేంద్ర, పి.నాగరాజ డైరెక్టర్లుగా లక్కిరెడ్డిపల్లె మండలంలోని మద్దిరబావుల సొసైటీకి బి. దేవేంద్ర రెడ్డి చైర్మన్‌గా జి.రెడ్డెయ్య, బి.బాబాఫక్రుద్దీన్ డైరెక్టర్లుగా, రామాపురం మండలంలోని కొలిమివాండ్లపల్లె సొసైటీకి ఎ.భాస్కర్ రెడ్డి చైర్మన్‌గా, ఎన్.సహదేవ రెడ్డి, సి.చంద్రశేఖర్, పి.ప్రభాకర్ రెడ్డి డైరెక్టర్లుగా, గాలివీడు మండలంలోని నూలివీడు ప్యాక్స్‌కు పి.ప్రభాకర్ రెడ్డి చెర్మన్‌గా, పి.మిట్టేనాయక్, బి.లోకేశ్వర డైరెక్టర్లుగా నియమితులు కానున్నారు.

హార్సిలీహిల్స్‌ను 'పతంజలి'కి అప్పగిస్తే ఉద్యమం

- కాంగ్రెస్, సీపీఐ నేతల హెచ్చరిక



హార్సిలీహిల్స్‌లో మాట్లాడుతున్న నాయకులు

బి.కొత్తకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వెల్‌నెస్‌సెంటర్ పేరుతో హార్సిలీహిల్స్‌ను పతంజలి సంస్థకు అప్పగిస్తే ఉద్యమిస్తామని కాంగ్రెస్, సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం పతంజలి అధి నేత, యోగా గురువు బాబా రాందేవ్ తన బృందంతో కలిసి హార్సిలీ హిల్స్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం మేరకు హార్సిలీహిల్స్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ లోని పలు పర్యాటక కేంద్రాలను పరిశీలిస్తున్నామని, ఈ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయిలో వెల్‌నెస్ సెంటర్‌ను నెలకొల్పుతామని ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన మదనపల్లె కాంగ్రెస్ ఇన్చార్జి రెడ్డిసాహెబ్, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు శనివారం హార్సిలీహిల్స్‌కు చేరుకొని పతంజలి సంస్థకు కేటాయించాలని భావిస్తున్న స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాందేవ్ బాబాపై తీవ్ర విమర్శలు చేశారు. హార్సిలీహిల్స్‌లో వున్న అటవీసంపదపై కన్నేసిన రాందేవ్‌బాబా వెల్‌నెస్ యోగాకేంద్రం స్థాపన పేరుతో రూ.కోట్ల విలువైన భూమిని కాజేయాలని చూస్తున్నారని, అదే జరిగితే పేదల ఊటీ హార్సిలీహిల్స్‌ను పేదలకు దూరం చేసినట్టేనని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయి వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు వల్ల పేదలకు ఏం ప్రయోజనం జరగదని, ఆర్థికంగా బలిసిన వ్యక్తులు అవాంఛనీయ కార్యకలాపాలు చేసేందుకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. హార్సిలీహిల్స్ రేవ్ పార్టీల కు, పాశ్చాత్య కల్చర్‌కు నిలయంగా మారుతుందని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల సహకారంతో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మనోహర్‌రెడ్డి, మురళి, తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి : డీసీహెచ్‌ఎస్



ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు

తంబళ్లపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు ఆదేశించారు. శనివారం తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులు, ఫార్మసీ, మందుల స్టాక్ రిజిస్టర్లు, పారిశుధ్యం పరిశీలించి ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, బాలింతల వార్డు, రక్త పరీక్షల ల్యాబ్, ఎక్స్‌రే విభాగాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్‌పేషెంట్లతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోజుకు ఎన్ని ఓపీలు చూస్తున్నారు..? ఎంతమందికి రక్త పరీక్ష లు చేస్తున్నారు.? ఏఏ పరీక్షలు చేస్తున్నారు.? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమై ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, అవసరమైన పరికరాలు, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్ ఎస్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో గుండెపోటు బాధితులకు అత్యవసర వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఖరీదైన గుండెపోటు నివారణ ఇంజక్షన్‌ను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారన్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆస్పత్రికి వచ్చే అత్యవసర కేసులపై దృష్టి సారించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి తేజస్విని, వైద్యులు విక్రాంత్‌రెడ్డి, మహేష్ రాజు, హెడ్ నర్సు గ్లోరి లిటిల్ ఫ్లవర్, సిబ్బంది బాలాజి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో అన్న క్యాంటీన్!



సర్వేయర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి

పీలేరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. శనివారం సర్వేయర్‌తో కలిసి యార్డు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2014 -19 మధ్య పీలేరులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రబంధ, వినోద్‌కుమార్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ హరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్త్రీనిధి రుణాలు చెల్లించాలి



గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

నిమ్మనపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏజీ ఎం సంతోష్ హెచ్చరించారు. శనివారం అగ్రహారం పంచాయతీలో స్త్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించకపోవడంతో చింతపర్తివారిపల్లి, నల్లగొండ, చెరువుముందరపల్లిలోని గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నవోదయ వీఓ కింద ఉన్న గ్రూపులు దాదాపు రూ.5.60 లక్షలు చెల్లించాలన్నారు. గతంలో ఇక్కడ సంఘమిత్రగా ఉన్న శారద సభ్యులు చెల్లించిన సొమ్మును దుర్వినియోగం చేయడంతో నవోదయ వీఓను బ్లాక్ లిస్టులో పెట్టామన్నారు. ప్రస్తుతం మండలానికి స్త్రీనిధి, ఉన్నతి నిధులు మంజూరయ్యాయని బకాయిలున్న గ్రూపు సభ్యులు సోమవారంలోగా చెల్లించాలని, లేని పక్షంలో చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ సాంబశివ, ఏపీఎం మురళి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో గొర్రెల బరువు వృద్ధి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న జేడీ గుణశేఖర్‌పిళ్లై

కలకడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నట్టల నివారణతో గొర్రెలు, మేకల బరువు వృద్ధి చెంది రైతులు ఆదా యం పొందవచ్చని పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. పోతువారిపల్లెలో నట్టల నివారణ శిబిరాన్ని తనిఖీ చేసి గొర్రెలకు మందు తాగించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ వరకు నట్టల నివారణ కార్యక్రమం ఉంటుందని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలానికి కేటాయించిన రూ.74 వేల డోసుల మందును సకాలంలో వేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఫలితాల నిర్ధారణ కోసం 10-14 రోజుల లోపు పేడ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో దొంగ

● 8 తులాల బంగారు నగల రికవరీ

కడప క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన దొంగను కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఒకరోజు కస్టడీలోకి తీసుకుని విచారించారు. చిన్నచౌకు సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి దొంగను విచారించి 8 తులాల బంగారు నగలను రికవరీ చేశారు. ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు... నగరంలోని చిలకలబావి ప్రాంతానికి చెందిన షేక్ అక్బర్ ఆలీ ఎలక్ట్రీషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడని, వ్యసనాలకు బానిసై ఈజీమనీ కోసం దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. ఈనెల 7వ తేదీన దొంగను అరెస్టు చేసి నాలుగు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. పలు చోరీ కేసుల్లో అక్బర్ నుండి రికవరీ చేసేందుకు తదుపరి దర్యాప్తు కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జడ్జి దొంగను ఒకరోజు కస్టడీకి అనుమతించగా విచారించి 8 తులాల బంగారు నగలను రికవరీ చేశామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచడంతో రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు దొంగ నుండి 12 తులాల బంగారు నగలు రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్ సంపులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

జమ్మలమడుగు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు శేషారెడ్డి పల్లి వెళ్లే దారిలో రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(30) నీళ్ల సంపులో పడి మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి బుధవారం డెమో రైలులో వచ్చి రైల్వేస్టేషన్ వద్ద దిగి మూడు రోజుల నుంచి ఆ ప్రాంతంలో సంచరించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మూడు రోజుల నుంచి ఆ ప్రాంతంలో తిరుగుతున్నట్లు అక్కడ పనిచేస్తున్న రైల్వేస్టేషన్ సిబ్బంది తెలుపగా ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే మృతుడు శుక్రవారం రాత్రి నీళ్ల సంపులో పడి ఉండొచ్చని, మృతుడి ఆచూకీ కోసం విచారిస్తున్నట్లు తెలిపారు. మృతుడు ఎర్రని చొక్కా, నల్లప్యాంటు ధరించాడని, లైటుగా గడ్డం ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతిపై అత్యాచారం

● పోలీసుల అదుపులో నిందితులు

దువ్వూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిల్ చేసి ఓ యువతిపై అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దువ్వూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వేణు అనే యువకుడు మాయమాటలు చెప్పి యువతిని రహస్య ప్రదేశానికి పిలిపించుకుని అత్యాచారం చేశాడు. ఆ సమయంలో యువతిని నగ్నంగా ఫోటోలు తీసి శాడిజంతో ప్రవర్తించాడు. అంతటితో ఆగక వేణు తన స్నేహితుడు కార్తీక్‌కు ఆలస్యంగా ఈ విషయాన్ని తెలిపి సదరు వీడియోలు అతనికి కూడా చూపించాడు. కార్తీక్ ఇదే ధోరణిలో ప్రవర్తించి యువతి పట్ల బ్లాక్ మెయిల్‌కు పాల్పడి రహస్య ప్రదేశానికి పిలిపించుకుని అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే వీడియోలు బయటపెట్టడంతో పాటు చంపుతామని బెదిరించాడు. ఈ విషయాన్ని బాధిత యువతి ఆలస్యంగా పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు శనివారం వేణు, కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఖైదీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

● కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు

కడప క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు అన్నారు. కడప సెంట్రల్ జైల్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప కేంద్ర కారాగారంలో ప్రస్తుతం రిమాండ్ ఖైదీలు, శిక్ష పడిన ఖైదీలతో కలిపి 591 మంది ఉన్నారన్నారు. కడప కేంద్ర కారాగారంతో పాటు రాష్ట్రంలోని వివిధ కేంద్ర కారాగారాలకు సబ్బులను ఇక్కడి నుంచే తయారు చేసి పంపిస్తామన్నారు. ఇక్కడున్న స్టీలు ఫ్యాక్టరీలో దాదాపు 80మంది ఖైదీలు పని చేస్తున్నారని, అలాగే టైలరింగ్‌లో 40మంది, పెట్రోలు బంకులో 12మంది, క్లీనింగ్ బ్యాచ్ 60మంది మొత్తం 300మందికి పైగా వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్నారన్నారు. ఖైదీలకు రోజుకు స్కిల్ ఉన్న వారికి రూ.200, సెమీ స్కిల్ ఉన్న వారికి ఒక కేటగిరిలో రూ.180, సెమీ ఓపెన్ జైలు వారికి రూ.160 చెల్లిస్తామన్నారు.

11 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఏపీఈఏడీ, ఎంసీఏ రెండో సెమిస్టర్ విద్యార్థులకు జూలై 11నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు ఉంటా యన్నారు. పరీక్షల పూర్తిస్థాయి టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి పొందాలని ఆయన తెలిపారు.

శవాన్ని పూడ్చలేని దుస్థితిలో.. ఆలంఖాన్‌పల్లె శ్మశాన వాటిక

● తక్షణమే శ్మశానవాటికలో ఉన్న డ్రైనేజీ నీటిని తొలగించాలి

● లేనిపక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తాం

● శవంతో రాస్తారోకో చేసిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు


స్థలం లేకపోవడంతో బురదనీటిలోనే శవాన్ని పూడుస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చనిపోయిన శవాన్ని పూడ్చలేని దుస్థితిలో ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటిక డ్రైనేజీ మురికినీరు, కంపచెట్లు.. జమ్ము, పిచ్చిమొక్కలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానంలో శవాన్ని పూడ్చేందుకు ఆరడుగుల జాగా కోసం వెతుకులాడుకునే పరిస్థితి దాపురించడం దారుణమన్నారు. గ్రామంలోని డ్రైనేజీ మురికినీటిని శ్మశానంలోకి మళ్లించడంతో మొత్తంగా మురికినీటి కుంటగా మారిందన్నారు. ఆ మురికినీటికి తోడు కంపచెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలు నిండుకుని శవాన్ని శ్మశానంలోకి తీసుకెళ్లలేక పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. పాలకులు మారుతున్నా ఆలంఖాన్‌పల్లె శ్మశానం దుస్థితి ఏమాత్రం మారకపోగా మరింత క్షీణదశకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె దళితవాడకు చెందిన పిడుగు రమేశ్ గుండెపోటుతో చనిపోయారు. ఈయన మృతదేహాన్ని పూడ్చడానికి వీలులేని దుస్థితిలో శ్మశాన వాటిక తయారైంది. ఈ నేపథ్యంలో సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో రమేశ్ మృతదేహంతో శ్మశానవాటిక వద్ద ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా శ్మశానవాటికలో సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. గతంలో వైసీపీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు మాత్రం ఓట్ల కోసం హామీలివ్వడం.. వాటిని గాలికొదిలేయడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. రెండు సంవత్సరాలుగా కలెక్టర్, నగరపాలక కమిషనర్, ఎమ్మెల్యేల దృష్టికి శ్మశానవాటిక సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. శ్మశానం రెండు వైపులా సాగు భూములు వెంచర్లుగా మారిన నేపథ్యంలో సమస్య మరింత జటిలమైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు నరసింహారావు, చెంచయ్య, భాగ్యలక్ష్మి, భరత్, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు కేశవ, ప్రసన్న, రాజేష్, చెండ్రాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


చనిపోయిన శవంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల డిగ్రీ హానర్స్ పరీ క్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెస ర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేష న్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావుతో కలిసి తన చాంబర్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లా డుతూ జిల్లా వ్యాప్తంగా బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీకాం, బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలను 80 కళాశాలల నుంచి 55 కేంద్రాలలో నిర్వహించామన్నారు. రెండో సెమిస్టర్ అన్ని కోర్సులకు కలిపి 6679 మంది పరీక్షలకు హాజరుకాగా 3843 మంది ఉత్తీర్ణుల య్యారని, నాలుగో సెమిస్టర్‌లో బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల విద్యార్థులు 5902 మంది హాజరు కాగా 3857 మంది, డిగ్రీ అన్నిగ్రూపుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 4883 మంది హాజరు కాగా 4802 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ సుబోష్‌చంద్ర, డాక్టర్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ శ్రీనివాసరావు

దాడి చేసిన వ్యక్తి అరెస్టు


అరెస్టు వివరాలను తెలుపుతున్న సీఐ కృష్ణారెడ్డి

చెన్నూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు లక్ష్మీనగర్‌కు చెందిన అన్నవరం సుబ్బరాయుడును కత్తితో దాడి చేసిన సంఘటనలో శనివారం అరె స్టు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఖాజీపేట మండలం చెముళ్లపల్లెకు చెందిన ములపాల సం తోష్‌కుమార్ గత నెల 28వ తేదీన వ్యక్తిగత పని మీద చెన్నూరు వచ్చారని, ఈ క్రమంలో పాత కక్షలను మనసులో పెట్టుకున్న అన్నవరం సుబ్బరాయుడు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. నెలరోజులుగా తప్పించుకుని తిరుగుతున్న సుబ్బరాయుడు ను స్థానిక కొత్తరోడ్డులో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

సూపర్ సిక్స్ అమలులో విఫలం: తులసిరెడ్డి

రాజంపేట టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి యేడాది దాటినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాజంపేట ఆర్‌అండ్‌బి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా హామీలను అమలు పరిచాలని డిమాండ్ చేశారు. రాజంపేట నియోజకవర్గంలో అన్నమయ్య ప్రాజెక్టుతో పాటు ఏఒక్క హామీని అమలుపరచలేదని, వెంటనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధిపరచాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జి పూల భాస్కర్, కాంగ్రెస్ నాయకులు అత్తింజేరి శ్రీనాథ్, మహదేవయ్య, గురవయ్య, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడిగా సుబ్రహ్మణ్యం

రైల్వేకోడూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు వ్యవసాయశాఖ ఉప సంచాలకుడిగా సుబ్రహ్మణ్యం (రెగ్యులర్) శనివారం బాధ్యతలు చేపట్టారు. రాయచోటి భూసార సంరక్షణ కేంద్రంలో పనిచేస్తూ ఆయన రైల్వేకోడూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఉపసంచాలకులుగా ఉన్న కవితకు ఇంకా పోస్టింగ్ వేయలేదు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నియోజకవర్గ రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

పరిశుభ్రతే మనందరి బాధ్యత

● తెల్లవారుజామునే ఇంటింటా చెత్త సేకరణ జరిగి తీరాలి : డీపీవో రాజ్యలక్ష్మి


మైనార్టీ కాలనీలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రజలను, ఊరిని ఆరోగ్యంగా చేస్తుందని, అందుకోసం గ్రామ పంచాయతీ సిబ్బంది ఉదయం 6గంటలకే ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. చెన్నూరు పట్టణంలో శనివారం ఉదయం చెత్త సేకరణ కార్యక్రమాన్ని డీపీవో పరిశీలించారు. అలాగే చెన్నూరు నుండి హైలెవెల్ వంతెన మీదుగా కొండపేట వెళ్లే దారిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక వైపు పెన్నానదీ తీరం వెంబడి నిల్వ ఉన్న చెత్త దిబ్బలను పరిశీలించారు. అక్కడ సమీపంలో ఉన్న శివాలయానికి మంచి సిమెంటు రోడ్డు వేశారు కాబట్టి ఇక రాకపోకలకు ఇదే దారి ఉంటుందని, ఆలయానికి వెళ్లేవారు రోడ్డుకిరు వైపులా ఉన్న చెత్త కుప్పలను, వ్యర్థాలను చూసి ముక్కుమూసుకుని వెళ్లకుండా భక్తితో వెళ్లాలంటే అందుకు తగ్గ వాతావరణం ఉండాలన్నారు. ఈ వాతావరణం పరిశుభ్రతతోనే సాధ్యమన్నారు. కావున అక్కడ చాలాకాలంగా నిల్వ ఉన్న చెత్త కుప్పలన్నీ పూర్తిస్థాయిలో తొలగించి అక్కడ మొక్కలు నాటి అందమైన బాటగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే తూర్పువీధి మైనార్టీ కాలనీలో డీపీవో పలు గృహాల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి తమ సిబ్బందికి అందించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌మోహనరావు, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ స్థలం ఆక్రమించారు

● తహసీల్దార్‌కు అంకాళమ్మ గూడూరు గ్రామస్థుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

సింహాద్రిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మ గూడూరులో వెలసిన అంకాళమ్మ దేవాలయ స్థలాన్ని ఆక్రమించారని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతిప త్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 392-ఎలో 2.77 ఎకరాల స్థలం పూర్వం నుండి అంకాళమ్మ దేవాలయానికి చెందినదని, తిరునాళ్ల సమయంలో చింత వనంలో అంగళ్ల ఏర్పాటుకు, అన్నదాన కార్యక్రమాలకు, వచ్చిన భక్తులు చెట్ల కింద సేదతీరడానికి, వాహనాల పార్కింగ్‌కు వినియోగించేవారన్నారు. గతంలో ఎద్దుల బండ్లపై భక్తులు వచ్చేవారని, ఈ ఎద్దు చింతవనంలో చెట్ల కింద సేద తీరేవన్నారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని మరింత మెరుగు పరిచేందుకు ఆలయ కమిటీ సభ్యు లు, గ్రామప్రజలు ప్రయత్నాలు సాగించగా గ్రామానికి చెందిన కొందరు ఆ స్థలం తమది అంటూ అభ్యంతరం తెలిపే ప్రయ త్నం చేశారన్నారు. ఆలయ భూమి ఆక్రమణ కాకుండా చూడాలని అంకాళమ్మ గూడూరుతో పాటు కడపనాగయ్యపల్లి, బొజ్జాయపల్లి తదితర గ్రామాల ప్రజలు, భక్తులు తరలి వచ్చి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాశినాయన, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఉప్పలూరు గ్రామానికి చెందిన దారిబోయిన రంగమ్మ(57) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపారు. వారి వివరాల మేరకు... బుధవారం వేపకాయలు ఏరుకుంటుండగా పాము కాటు వేసిందని, ఆ వెంటనే రామాయపల్లెలో నాటువైద్యం చేయించి అనంతరం చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం మృతురాలి భర్త వెంకట్రామయ్య కూడా చేపల వేటకు వెళ్లి సగిలేరులో పడి చనిపోయాడు.

ఎన్ఐఎస్‌డీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత


ప్రొఫెసర్ లలితకు ఆర్డర్‌ను అందజేస్తున్న వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ విభాగంలో జెరియాట్రిక్ కౌన్సెలింగ్‌పై అడ్వాన్స్ కోర్సు మాడ్యుల్‌ను సిద్ధం చేయడానికి ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీలో సభ్యురాలిగా యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కె.లలితకు చోటు లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్ఐఎస్‌డీ) సంస్థ వృద్ధుల కోసం మాడ్యుల్‌లను సిద్ధం చేయనుంది. అడ్వాన్స్ కోర్సు అయిన జెరియాట్రిక్ కౌన్సెలింగ్ కోసం సమగ్ర కోర్సు పాఠ్యాంశాలు, మాడ్యూళ్లను అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా ఛైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు గల స్టీరింగ్ కమిటీని నామినేట్ చేసింది. ఛైర్మన్‌గా ఎన్ఎస్ఐడీ డిప్యూటీ డైరెక్టర్ (సీనియర్ సిటిజన్ డివిజన్) డాక్టర్ హెచ్.సి.శ్రీధర్ చెన్నకశవ రంగారెడ్డితో పాటు వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులతో కూడిన కమిటీలో వైవీయూ నుంచి డాక్టర్ లలిత పని చేయనున్నారు. ఇప్పటికే ఉన్న జాతీయ నైపుణ్య చట్రాలకు అనుగుణంగా కంటెంట్‌ను రూపొందించడం, తగిన అధ్యయన సామాగ్రి, అభ్యాస వనరులు అంచనా పద్ధతులను సిఫార్సు చేస్తారు. స్టీరింగ్ కమిటీ పదవీకాలం కోర్సుమాడ్యుల్స్ చివరిగా పూర్తిచేసి సమర్పించే వరకు ఉంటుందని ఎన్ఎస్ఐడీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హెచ్.సి.శ్రీధర్ చెన్నకేశవ రంగారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ప్రొఫెసర్ డాక్టర్ లలితకు ఎన్ఐఎస్‌డీ స్టీరింగ్ కమిటీలో చోటు దక్కడం ప్రశంసనీయమని వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కుల సచివులు ఆచార్య పి.పద్మ, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.లాజర్, సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

'మళ్లీ అధికారం మాదేనంటూ వైసీపీ కలలు'

సిద్దవటం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మళ్లీ అధికారం మాదేనంటూ వైసీపీ నేతలు కలలు కంటున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని మాధవరం-1 గ్రామం ఎస్‌కేఆర్ నగర్‌లోని టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కూటమి నేతలను జైల్లో పెడతామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసీపీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి, ఎన్ఆర్ఐ చంద్ర, టీడీపీ మహిళా నేత గంజి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై క్షేత్రస్థాయి పరిశీలన


గట్టు చెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బావాజాన్ తదితరులు

బి.కొత్తకోట, జూన్28 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ చెరువుల్లో భూకబ్జాలపై తహసీల్దార్ బావాజాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం విచారణ చేపట్టారు. 'చెరువులు చెర- అధికారులకు ఎర' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచేరితమైన కథనంపై స్పందిస్తూ పలు చెరువుల్లో సర్వేలు చేపట్టారు. స్థానిక సర్వేయర్ ముబారక్, మరో ఇద్దరు సర్వేయర్లను వెంటబెట్టుకుని గుమ్మసముద్రం, గట్టు, పత్రవారిపల్లి చెరువులను పరిశీలించారు. సర్వేలో ఆక్రమణలుగా తేలిన చోట సంబంధిత వ్యక్తులకు ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించారు. మరికొన్ని చోట్ల పంటలున్నా ఆ ప్రదేశం చెరువు మునగడలో భాగం అని, చెరువుకు ఆనుకుని పట్టా భూములు కలిగివున్న రైతులు చెరువులో కొంతభాగంలో పట్టుకోవడానికి చట్టం అనుమతి ఉందన్నారు. రికార్డుల మేరకు చెరువుల స్థలాన్ని పరిరక్షిస్తామని, ఆక్రమణలు వుంటే స్వచ్ఛందంగా తొలగిపోవడం మంచిదని తహసీల్దార్ కోరారు. ఆర్ఐ రామాంజనేయులు, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

మదనపల్లె అర్బన్, జూన్28(ఆంధ్రజ్యోతి): తరిగొండ మీదుగా మదనపల్లె నుంచి గుర్రంకొండకు, రామసముద్రం మీదుగా మదనపల్లె నుంచి ఎలవనెల్లూరుకు సర్వీసులను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. స్థానిక టు డిపోలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు డిపో మేనేజర్ అమరనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె నుంచి తరిగొండ మీదుగా గుర్రంకొండకు ప్రస్తుతం నడుస్తున్న సమయంలోనే బస్సు నడపాలని కోరారు. మదనపల్లె నుంచి రామసముద్రం మీదుగా ఎలవనెల్లూరు రెండేళ్ల కిందట బస్సు నడిచేదని మళ్లీ ఇప్పుడు పునర్ధురించాలని కోరారు. రామసముద్రం మీదుగా పుగనూరుకు బస్సు నడపాలని అడిగితే పుంగనూరు డిపో నుంచి అడగమన్నామని చెప్పారు. రామసముద్రం రోడ్డులో ఉదయం 9 గంటలకు సర్వీసు పెట్టాలని ప్రయాణీకులు కోరారని, అయితే ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని ప్రయత్నిస్తాం అని డీఎం పేర్కొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం


కొత్తగా ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్షులతో టీడీపీ నేతలు

ములకలచెరువు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు, పాత ములకలచెరువు టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు మేకల రెడ్డిశేఖర్ ప్రకటించారు. ములకలచెరువు కమిటీ అధ్యక్షుడిగా కట్టా హరినాథ్, పాత ములకలచెరువు కమిటీ అధ్యక్షుడిగా ఎం.శివప్రసాద్ ఎన్నికయ్యారు. టీడీపీ నేతలు మంత్రి గిరిధర్‌రెడ్డి, గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, భజంత్రీ రామాంజులు, నేతలు చాంద్‌బాషా, నీలకంఠారెడ్డి, ఫాస్టర్ శ్రీనివాసులు, సుబ్బినాయుడు, మురళి, రసూల్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

● మంత్రి లోకేష్‌ను కలిసిన టీడీపీ నేత సిద్ధా



ములకలచెరువు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శనివారం నారా లోకేష్‌ను టీడీపీ అధ్యక్షుడు కలిశారు. మండల అభివృద్ధి గురించి నిధులు కేటాయించాలని కోరారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు.

సారా రహిత గ్రామాల లక్ష్యసాధనకు కృషి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ జబీవుల్లా

రామసముద్రం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయ 2.0లో భాగంగా సారా రహిత ఆదర్శ గ్రామాలుగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా అన్నారు. శనివారం చెంబకూరు పంచాయతీ దిన్నిమీద హరిజనవాడలో సర్పంచ్ ఆధ్వర్యంలో నవోదయ 2.0 నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ఆయా గ్రామాల గ్రామస్తులు సమష్టి కృషి అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ నాటు సారాకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మెన్ చంద్రశేఖర్, ప్రముఖ విద్యావేత్త సదుం రవి, వీఆర్వో గౌరి, మహిళా పోలీస్ రేవతి, ఉపాధ్యాయులు, ప్రోహిబిషన్ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ.. ఇటు చూడండి

● జ్యోతిసర్కిల్‌లో ఇష్టారాజ్యంగా పార్కింగ్

● యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన


నిత్యం ట్రాఫిక్ సమస్య ఇలా

బి.కొత్తకోట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రధాన నగరాలకు రాకపోకలు సాగాలన్నా పట్టణంలోని ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా జ్యోతిసర్కిల్ మీదుగా వెళ్లాల్సిందే. పొరుగు మండలాలైన పీటీఎం, ములకలచెరువు సరిహద్దు గ్రామ ప్రజలు నిత్యం ఇక్కడ చేరి తిష్ట వేయడంతో చాలా రద్దీగా వుంటోంది. పట్టణానికి వచ్చే ద్విచక్రవాహన దారులు ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ లెక్కల ప్రకారం 100 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డు ఆక్రమణలకు గురై ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారవుతోంది.

బి.కొత్తకోట నగరపంచాయతీలో ప్రధాన కూడలి జ్యోతిసర్కిల్. పట్టణంలోంచి మదనపల్లె, బెంగళూరు, కదిరి, చింతామణి, బెంగళూరు ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా ఈ సర్కిల్ మీదుగానే వాహనాలు వెళ్లాలి. పట్టణంలోని నాలుగు ప్రధాన రోడ్లలో ఏ రోడ్డుకు ఏ పని మీద వెళ్లాలన్నా ఈ జ్యోతి సర్కిల్‌కు రావాల్సిందే. వందడుగుల వెడల్పు వుండాల్సిన రోడ్డు కుచించుకుపోగా మిగిలిన కొద్దిరోడ్డులో రెండువైపులా ద్విచక్రవాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. అంతేకాకుండా దారికి అడ్డంగా తోపుడు బండ్లు, దుకాణాల ఎదుట తమకు తోచినట్లు కబ్జాలు చేసి కాంక్రీట్లు వేసుకున్నారు. ఇక వాహనాలు వెళ్లేది ఎలా? దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వుంటోంది. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు, ఆక్రమణలు తొలగించాల్సిన నగరపంచాతీ అధికారులు, రోడ్డును అడగాల్సిన ఆర్‌అండ్‌బీ, కొలిచి ఇవ్వాల్సిన రెవెన్యూ అధికారులు ఇలా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో జ్యోతిసర్కిల్‌లో నిబంధనలు ఉల్లంఘించబడుతున్నాయి. మదనపల్లె వైపు వెళ్లాల్సిన మహిళలు, విద్యార్థులు కనీసం నిలుచుకునేందుకు కూడా వీలు లేని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


బైక్‌స్టాండ్‌లా కనిపిస్తున్న బి.కొత్తకోట జ్యోతిసర్కిల్ - ఇష్టారాజ్యంగా పార్కింగ్‌తో...

వారాహి అమ్మవారికి నేడు పుష్ప పల్లకి

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నేడు ఊరేగింపు ● నేడు పూర్తికానున్న హోమం, పూజలు

కలికిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం గుప్త నవరాత్రులు మొదటిసారిగా జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి పుష్ప పల్లకి పట్టణంలో ఊరేగింపు ప్రత్యేకత సంతరించుకోనుంది. స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి ఆలయంలో వారాహి అమ్మవారు కొలువు దీరి వున్నారు. ఈ ఏడాది ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి చొరవతో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు కూడా నిర్వహిస్తున్నారు. నవరాత్రులు పూర్తయిన వెంటనే యల్లమ్మ జాతర నాలుగు రోజులు జరగనుండడం విశేషం. కాగా వారాహి అమ్మవారి పుష్ప పల్లకి అలంకరణ కోసం తమిళనాడు రాష్ట్రం ఆంబూరు నుంచి ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత ఆకర్షణీయంగా వారాహి అమ్మవారి పుష్ప పల్లకి అలంకరణ కోసం వివిధ రకాల విదేశీ పుష్పాలను ఉపయోగించనున్నారు. ఆదివారం సాయంకాలం అమ్మవారు గ్రామోత్సవంలో భాగంగా పురవీధుల్లో విహరించనున్నారు. ఎమ్మెల్యే దంపతులు కూడా ఈ పల్లకీ ఊరేగింపులో పాల్గొననున్నారు. నిర్వాహకులు, భక్తులు, ఎమ్మెల్యే అనుచరులు పెద్ద ఎత్తున ఏర్పాట్లలో వున్నారు. కాగా నల్లారి తనూజా రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన వారాహి హోమ శాంతి పూజలు ఆదివారం పూర్తి కానున్నాయి.


ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

వారాహి అమ్మవారి ప్రాశస్త్యం

వారాహి అమ్మవారి ప్రాశస్త్యం ప్రాచుర్యంలోకి వస్తోంది. భయ నివారణ, దృష్టి దోష నివారణ, ధైర్య విశ్వాసాలు కలిగించడంలో అమ్మవారి కటాక్షంతోనే జరుగుతుందని భక్తలు నమ్ముతారు. ఈ మేరకు వారాహి దేవికి ప్రత్యేక పూజలు, నిత్య దీపారాధన, హోమాలు చేయడంతో విశేష ఫలితాలు లభిస్తాయని కూడా చెబుతారు. అమ్మవారిని సేవిస్తే ఆత్మవిశ్వాసం బలపడుతుందని, అజ్ఞాత భయాలు తొలగిపోతాయని, శత్రు బలాలను అధిగమిస్తారని, కుటుంబానికి అమ్మవారు రక్షణ కవచమై నిలుస్తారని, ఆర్థిక సుస్థిరతకు మార్గం ఏర్పడుతుందని పండితులు చెబుతారు. వారాహి అమ్మవారి అనుగ్రహం ఉంటుందని, ప్రత్యేక జాగరణ, హోమాలు, తాంబూళాల సమర్పణతో అమ్మవారి అనుగ్రహం లభిస్తుందంటున్నారు.

పోతబోలు సంఘమిత్రపై కలెక్టర్‌కు ఫిర్యాదు

● రూ.30లక్షల అవినీతి జరిగిందంటూ ఆరోపణ

● విచారణ ప్రారంభించిన అధికారులు

మదనపల్లె టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పోతబోలు గ్రామంలో పనిచేస్తున్న సంఘమిత్రపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం డ్వాక్రా అధికారులు విచారణ ప్రారంభించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంలు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అధికారులు విలేజ్ గ్రూప్‌లోని సభ్యులను పిలిపించి విచారించారు. పోతబోలు సంఘమిత్ర శ్వేత రూ.30లక్షలు అవినీతికి పాల్పడిందని అదే గ్రామానికి చెందిన గ్రూపు సభ్యురాలు అమ్మాజి గత నెల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీని ఆదేశించడంతో పీడీ ఆదేశాలతో వెలుగు అధికారులు విచారణ చేపట్టారు. మరో విచారించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని ఏపీఎం తెలిపారు.

మీడియాపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మదనపల్లె టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మహాటీవీ న్యూస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని మదనపల్లె ప్రెస్‌క్లబ్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మహాటీవీ కార్యాలయంపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడి చేసిన ఆస్తులు ధ్వంసం చేశారన్నారు. పత్రికా స్వేచ్ఛపై దాడి సహించరానిదని, ఈ విషయమై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, మోహన, శివారెడ్డి, వంశీధర్, బాలనాగు, శ్రీనివాసులు, రామచంద్ర, కేశవ, శ్రీనాథ్, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డికి సన్మానం


శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న వేపులబైలు టీడీపీ నేతలు

పీలేరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డిని వేపులబైలు టీడీపీ నేతలు సన్మానించారు. వరుసగా మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు శ్రీకాంత్ రెడ్డి అపార్ట్‌మెంట్ వద్ద సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకటరెడ్డి, వసంతాల రాజ, మల్లికార్జున రెడ్డి, కే. శంకరయ్య, టీ. శ్రీరాములు, జాండ్ల దామోదర్ రెడ్డి, విశ్వనాద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పాలేటి, బోయకొండ గంగమ్మ జాతర్లు

నిమ్మనపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): దేవళం కురవపల్లిలో వెలసిన పాలేటి గంగమ్మ, గంగాపురంపల్లిలో వెలసిన బోయకొండ గంగమ్మ జాతర్లు శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మహిళలు దీలు బోనాలు మోశారు. రాత్రి కోలాటలు, చెక్కభజనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అమ్మవార్లకు చాందినీ బండ్లులు కట్టి ఊరేగింపు చేపట్టి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తెల్లవారు జామున పొట్టేళ్లను ఆగారం ఇచ్చి పండగను వేడుకగా చేసుకున్నారు. గ్రామాల్లో గంగజాతర్లు జరుగుతుండంతో బంధుమిత్రులు, స్నేహితుల రాకపోకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

నేడు గురుపూజోత్సవం

పీలేరు రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు పీలేరు ఖండ్ కార్యనిర్వాహక్ ప్రొద్దుటూరు మధుసూదన తెలిపారు. శనివారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ స్వయం సేవక సంఘ్ వందేళ్లు పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం కార్యక్రమం ఉంటుందన్నారు. జాతీయ జీవనానికి, హిందూ సంస్కృతికి ప్రతీకగా నిలచిన పరమ పవిత్ర భగవద్వజాన్ని రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ శ్రేష్ఠ గురువుగా స్వీకరించిందని తెలిపారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ బిల్లులు వసూలు

మదనపల్లె టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఆదివారం 13 కౌంటర్లలో విద్యుత్ బిల్లులు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం పేర్కొన్నారు. ఆదివారం సెలవు రోజు అయినా డివిజన్‌లో 13 విద్యుత్ బిల్లుల వసూలు కౌంటర్లు తెరిచే వుంటాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ ఒక ప్రకటనలో కోరారు.

సీహెచ్‌సీ వైద్యుడిగా మహేష్‌రాజు

తంబళ్లపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా మహేష్ రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాయచోటి ప్రభుత్వాస్పత్రి నుంచి బదిలీపై తంబళ్లపల్లెకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూ ప్రజలకు, రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తానన్నారు. నూతన వైద్యుడికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు.

సబ్సిడీ సర్వీసులను క్రమబద్ధీకరించుకోండి

వాల్మీకిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసులకు అడిషనల్ లోడ్ కలిగి ఉన్న వారు సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో కూడిన డెవలెప్‌మెంట్ చార్జీలను చెల్లించి సర్వీసులను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డెవలెప్‌మెంట్ చార్జీలు చెల్లించేందుకు ఇక రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. 29, 30 తేదీల్లో చెల్లింపులు చేసే వారికి సబ్సిడీ అవకాశం వర్తిస్తుందన్నారు. ఆదివారం కూడా చెల్లింపుల కౌంటర్ ఉంటుందని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్హులకు రుణాలు ఇవ్వండి

మదనపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలు, మధ్యతరగతికి ఇస్తున్న రుణాలు అర్హులకే ఇవ్వాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎక్కడా లేని విధంగా మదనపల్లెలో అధికార పార్టీ నేతలు చెప్పినట్లు లబ్ధిదారుల పేర్లు సిఫార్సు చేస్తే మెప్మా, అక్కడి నుంచి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆరోపించారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరితో బ్యాంకర్లు ఓపెన్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ

తంబళ్లపల్లె, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన థామస్ రాజాను పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, టీడీపీ నేతలు సన్మానించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే విధంగా చొరవ చూపాలని, ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని నూతన ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జయరాంరెడ్డి, జగదీష్, భాస్కర్, చాణు తదితరులు ఉన్నారు.

పిల్లలకు బైక్‌లు ఇవ్వడం తల్లిదండ్రుల నిర్లక్ష్యమే..

వాల్మీకిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అర్హత లేకపోయినా, కాళ్లు అందకపోయినా బైక్‌లపై వేగంగా చక్కర్లు కొడుతూ దర్శనమిస్తున్నారు మైనర్లు. తమ పిల్లలు చిన్నవయసులోనే వాహనాలు నడిపేస్తున్నారన్న మోజులో పడిపోతున్న తల్లిదండ్రులు ఏదైనా సంఘటన జరిగితే చోటుచేసుకునే పరిణామాలకు తాము బాధ్యులు అన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారన్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటికీ ద్విచక్ర వాహనాలు ఉండడం గమనార్హం. అయితే వాహనాలను నడిపేవిషయంలో తల్లిదండ్రులు ఆంక్షలు విధించాల్సి ఉంది. వేకువ జాము మొదలు చీకటి పడేదాకా బాలబాలికలు ఎటు చూసినా ద్విచక్రవాహనాలపైనే దర్శనమిస్తుంటారు. ఉదయం ట్యూషన్లు మొదలుకుని పాఠశాలలకు కూడా తమ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇచ్చి పంపడం సరదాగా మారిపోయింది. పోలీసులు ఎన్నోసార్లు హెచ్చరికలు చేసినా తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వహిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లలు బైక్‌లపై వెళ్లే సమయంలో రోడ్లపై జారి పడడం, అదుపు తప్పి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొన్న సందర్భాలూ లేకపోలేదు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

పిల్లలకు వాహనాలు ఇస్తే కేసులు

రోజు నిఘా పెట్టి వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తున్నాం. రికార్డులు లేని, పిల్లలు బైక్‌లు నడుపుతూ కనిపిస్తే జరిమానాలు విధిస్తాం. ఏదైనా సంఘటనలో తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత. వాహనాల తనిఖీల్లో పట్టుబడితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. తల్లిదండ్రుల బాధ్యతగా వ్యవహరించాలి.

ప్రసాద్‌బాబు, సీఐ, వాల్మీకిపురం

నాలుగు కమిటీలు ఏకగ్రీవం - మూడు చోట్ల పోటీ


పాపేపల్లి గ్రామ కమిటీ సమావేశం

పెద్దమండ్యం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరిగిన టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో నాలుగు చోట్ల ఏకగ్రీవం కాగా మూడు చోట్ల పోటీ నెలకొందని మండల టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు దేవరింటి శ్రీనివాసులు వెల్లడించారు. ముసలికుంట కమిటీ అధ్యక్షుడిగా జి. రమేష్, ప్రధాన కార్యదర్శి యోగాంజులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. దిగువపల్లి కమిటీ అధ్యక్షుడిగా రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌నాయుడు, అవికేనాయక్ తండా అధ్యక్షుడిగా మల్లికార్జుననాయక్, ప్రధాన కార్యదర్శి జయరాంనాయక్, మందలవారిపల్లి అధ్యక్షుడిగా ఎం. ఈశ్వరనాయుడు, ప్రధాన కార్యదర్శిగా బి. రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పాపేపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పదవికి 13 మంది పోటీలో వున్నారు. రామానాయక్ తండా గ్రామ కమిటీ అధ్యక్షుడు పదవికి ఇద్దరు, బండ్రేవు అధ్యక్షుడు పదవికి ఐదుగురు పోటీలో వున్ననట్లు ఆయన తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, ఆయా గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దమండ్యం, తంబళ్లపల్లి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వర, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వేగానికి కళ్లెం వేయండి

● అతి వేగంగా వాహనాలు నడుపుతున్న ఆకతాయిలు

● స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

● ప్రమాదాలు అరికట్టాలని కోరుతున్న ప్రజలు


ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఐటీఐ ముందు విద్యార్థులు, ప్రజలతో రద్దీగా ఉన్న రోడ్డు

తంబళ్లపల్లె, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ఆకతాయిలు బండ్లను అతి వేగంగా నడుపుతూ ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. స్థానిక రాగిమాను కూడలి నుంచి పాత దూరదర్శన్ రిలే స్టేషన్ వరకు నిత్యం ప్రజలు, వాహనాల రాకపోకలతో చాలా రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులోనే ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఐటీఐ, ప్రభుత్వాస్పత్రి, ఇండియన్ బ్యాంకు, విద్యుత్, విద్యా, దేవదాయ శాఖ, పశు వైద్య కార్యాలయం, ఓ ప్రవేటు పాఠశాల ఉన్నాయి. దీంతో నిత్యం జనసంచారంతో కిటకిటలాడుతుంటోంది. ఈ రోడ్డుకు ఎక్కడా గాని స్పీడు బ్రేకర్లు, ప్రమాద సూచిక బోర్డులు లేవు. దీంతో రోడ్డుపై ఆకతాయిలు బండ్లను ఇష్టారీతిన నడుపుతూ రహదారిపై పోయే వారిని ప్రమాదాలకు గురిచేస్తున్నారు. పాఠశాల సమయంలో రోడ్డుపైన నడవాలంటే భయ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పిల్లల తల్లిదండ్రులే స్వయంగా పాఠశా లలో వదిలి మళ్లీ సాయంత్రం ఇళ్లకు పిలుచుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్ప డింది. నిత్యం విద్యార్థులు, జన సంచా రంతో రద్దీగా ఉండే ఈ రహదారిలో వేగ నియంత్రికలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో స్పీడు బ్రేకర్లు

గతంలో ఈ రోడ్డుకు ప్రభుత్వాస్పత్రి, ప్రాథమిక పాఠశాల, బ్యాంకు ముందు స్పీడు బ్రేకర్లు ఉండేవి. అయితే ఎనిమిదేళ్ల కిందట కొత్తగా సిమెంటు రోడ్డు వేయడంతో అవి తొలగిపోయాయి. దీంతో అప్పటి నుంచి ఈ పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వాస్పత్రి ముందు బోలేరో వాహనం టూవీలర్‌ను ఢీ కొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఇదే రోడ్డులోనే రెండు టూ వీలర్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాయ్యారు. కొన్ని నెలల కిందట రోడ్డు దాటుతున్న ఓ చిన్నారిని ద్విచక్రవాహదారుడు ఢీకొనడంతో చిన్నారి చేయి విరిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల వద్ద స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా అరికట్టాలని ప్రజలు, పిల్లల తల్లితండ్రులు కోరుతున్నారు.